



జిల్లా అధికారులతో సమావేశమైన స్పెషలాఫీసర్ సిసోడియా, చిత్రంలో కలెక్టర్ తమీమ్ అన్సారియా, జేసీ అశుతోష్ శ్రీవాస్తవ తదితరులు

ప్రభావం తీవ్రంగా ఉండొచ్చు.. జాగ్రత్త

● సమీక్షలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సిసోడియా ఆదేశాలు

గుంటూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): తుపాను ప్రభావం గతంలో వాటి కంటే ఎక్కువగా ప్రభావం చూపే అవకాశం ఉందని వాతావరణశాఖ నిపుణులు హెచ్చరిస్తున్న నేపథ్యంలో అధికారులు రానున్న నాలుగు రోజులు సహాయక చర్యలపై పూర్తిస్థాయిలో నిమగ్నమై ఉండాలని ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, జిల్లా, ప్రాంతీయ ప్రత్యేక అధికారి ఆర్‌పీ సిసోడియా తెలిపారు. తుపాన్ దృష్ట్యా జిల్లా పరిస్థితులపై సమీక్షించేందుకు ఆదివారం సాయంత్రం గుంటూరు వచ్చిన సిసోడియా తొలుత కంట్రోల్‌రూమ్ కార్యకలాపాలను పరిశీలించారు. అనంతరం జిల్లా అధికారులతో కలెక్టరేట్‌లో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుపాను ప్రభావంతో జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, యంత్రాంగం పూర్తి అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఆహార నిల్వలు సిద్ధంగా ఉంచాలని తెలిపారు. శిథిలావస్థలో ఉన్న భవనాల్లో ఎవరూ ఉండకుండా ఖాళీ చేయించాలన్నారు. బలహీనంగా ఉన్న గోడలు, పూరి గుడిసెలు వంటి వాటిని దృష్టిలో పెట్టుకోవాలన్నారు. బలహీనంగా ఉన్న చెట్లు, పడిపోవడానికి అవకాశం ఉన్న చెట్లపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. విద్యుత్ రంపాలు(పవర్ సాస్) సిద్ధంగా పెట్టుకుని చెట్లు పడితే తక్షణం తొలగించే ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. గండి పడేందుకు అవకాశం ఉన్న ప్రదేశాలను గుర్తించి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రమాదకరంగా ఉన్న కాజ్‌వేలు వద్ద రెవెన్యూ, పోలీస్ ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. తాగు నీరు ఎక్కడా కలుషితం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, విద్యుత్ అంతరాయం కలిగితే తాగు నీటిని పంపింగ్ చేసేందుకు జనరేటర్లు సిద్ధం చేయాలన్నారు. తాగునీటి అంతరాయం ఉండరాదని చెప్పారు. విద్యుత్ స్తంభాలు కూలిపోయిన వెంటనే పునరుద్ధరణకు అధికారులు సిద్ధంగా ఉండాలన్నారు. వర్షాలపై రైతులకు స్పష్టమైన అవగాహన కల్పించాలని పొలంలో ఉన్న పంటలకు ఎటువంటి నష్టానికి గురికాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ తమీమ్ అన్సారియా మాట్లాడుతూ ప్రతి మండలానికి ప్రత్యేక అధికారులను నియమించామన్నారు. పునరావాస కేంద్రాలను గుర్తించి సిద్ధంగా ఉంచామన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, డీఆర్వో ఎన్ఎస్‌కే ఖాజావలి, నగర పాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు, పశు సంవర్థకశాఖ సంయుక్త సంచాలకుడు కేవీవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేటి పీజీఆర్ఎస్ రద్దు

ప్రజా సమస్యల పరిష్కారం కోసం సోమవారం నిర్వహించాల్సిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)ను కూడా రద్దు చేసినట్లు కలెక్టర్ అన్సారియా తెలిపారు. తుఫాన్ దృష్ట్యా ప్రజలు వ్యయ ప్రయాసలతో పీజీఆర్ఎస్‌కు రావద్దని కోరారు.

మొంథా.. అలర్ట్

తుఫాన్‌పై హెచ్చరికలు జారీ

- అప్రమత్తమైన అధికార యంత్రాంగం
- ఎక్కడికక్కడ ఏర్పాట్లతో సర్వం సన్నద్ధం
- అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆదేశాలు
- పంటలపై తీవ్ర ప్రభావం చూపే అవకాశాలు
- భారీ వర్షాలపై హెచ్చరికలతో ఆందోళనలో రైతులు



కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూంని సందర్శిస్తున్న స్పెషలాఫీసర్ సిసోడియా, చిత్రంలో కలెక్టర్ అన్సారియా తదితరులు

● రెడ్ అలెర్టు.. కలెక్టరేట్‌లో కంట్రోల్‌రూం

గుంటూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ముంచుకొస్తున్న మొంథా తుఫాన్‌పై అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. తుఫాన్ పరిణామాలను సమర్థంగా ఎదుర్కొనేందుకు అధికారులు సర్వం సిద్ధమయ్యారు. ఎక్కడికక్కడ ఏర్పాట్లు కూడా పూర్తి చేశారు. సోమవారం నుంచి మూడు రోజులు భారీ వర్షాల హెచ్చరికల నేపథ్యంలో మండల, గ్రామ స్థాయిల్లో కూడా అధికారులు జాగ్రత్తలు తీసుకుంటు న్నారు. ఎటువంటి పరిస్థితి నెలకొన్నా ఆస్తి, ప్రాణ నష్టాలు జరగకుండా చూడాలని అధికా రులు ఆదేశాలు జారీ చేశారు. లోతట్టు ప్రాంతా ల్లోని, నదీ తీర ప్రాంత, లంక గ్రామాల్లోని ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించ డంపై కూడా అధికారులు దృష్టి పెట్టారు. మొంథా తీవ్రత ఏ స్థాయిలో ఉన్నప్పటికీ సమర్థంగా ఎదుర్కోవ డానికి సిద్ధంగా ఉన్నామని ఆయా విభాగాల అధికారులు చెబుతున్నారు. జలవనరులు, పోలీసు, రెవెన్యూ, పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ, మున్సిపల్, వ్యవసాయ, రవాణా, విద్యుత్, మత్స్య శాఖలను అధికారులు, సిబ్బందిని అప్రమత్తం చేశారు. సోమ, మంగళ, బుధవారాల్లో ప్రజలు అత్యవసర పరిస్థితుల్లోనే ఇళ్ల నుంచి బయటకు రావాలని అధికారులు సూచించారు. సోమవారం మధ్యాహ్నం నుంచి తుఫాన్ ప్రభావం ఉండవచ్చని, రాత్రికి ఈదురుగాలులతో కూడిన వర్షం పడే పరిస్థితి ఉందని వాతావరణశాఖ సూచనలు జారీ చేయగా అందుకు తగినట్లు అధికారులు సర్వం సిద్ధమయ్యారు. తుఫాన్‌ను ఎదుర్కొనేందుకు కావాల్సిన సామగ్రిని సిద్ధం చేసుకోవాలని మండల, గ్రామ స్థాయిలో అధికారులను ఆదేశించారు. ఎలాంటి ఇబ్బందులు ఉన్నా ప్రజలు తక్షణమే కంట్రోల్‌రూమ్‌కు ఫోన్ చేసి తెలపాలని సూచించారు. ప్రజలు కావాల్సిన నిత్యావసర వస్తువులను కొంత మేర ముందస్తుగా తీసుకుని ఉంచుకోవాలన్నారు. మొత్తం మీద తుఫాన్ సంబంధించి ముందస్తు చర్యల్లో అధికార యంత్రాంగం నిమగ్నమైంది. వాయుగుండం ప్రభావంతో జిల్లాలో సోమవారం ఓ మోస్తరు నుంచి భారీవర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. ఈ నేపథ్యంలో జిల్లాకు రెడ్ అలెర్ట్ జారీ చేశారు. మొంథా తుపాను తరుముకు వస్తుండటంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. భారీ వర్షాలు కురిస్తే చేపట్టాల్సి ముందస్తు చర్యలకు అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. మరో వైపు రైతులు పంటలను కాపాడుకోవడానికి తీవ్రంగా శ్రమిస్తున్నారు. కోతకు సిద్ధంగా ఉన్న వరిపైరును వర్షం బారి నుంచి తక్కువ నష్టంతో కాపాడుకోవడానికి అన్నదాతలు చెమటోడుస్తున్నారు.



హార్బర్‌లో కొనసాగుతున్న హెచ్చరిక

నిజాంపట్నం హార్బర్‌లో ఆదివారం కూడా ఒకటో నెంబరు ప్రమాద హెచ్చరిక కొనసాగుతుంది. మత్స్యకారులు ఎవరూ వేటకు వెళ్ళరాదని పోర్టు అధికారులు సూచించారు. సముద్రం అంచున నివశించే మత్స్యకారులు పునరావసకేంద్రాలు, తుఫాన్‌షెల్టర్లలోకి వెళ్లాలని సూచించారు. జెట్టీల్లోని బోట్లు, పడవలు కొట్టుకుని వెళ్లకుండా భద్రత చేసుకోవాలని సూచించారు.

మూడు రోజులు విద్యాసంస్థలకు సెలవు

అతి భారీ వర్షాల నేపథ్యంలో సోమవారం నుంచి బుధవారం వరకు విద్యాసంస్థలకు కలెక్టర్ సెలవులు ప్రకటించారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలు, అంగన్‌వాడీ కేంద్రాలకు, కళాశాలలకు మూడు రోజులు సెలవు ఇవ్వాలన్నారు. తుఫాన్ కారణంగా ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా నివారించే ఉద్దేశంతో విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించినట్లు కలెక్టర్ తెలిపారు.

సహాయక చర్యలకు రూ. 50 లక్షల విడుదల

తుపాను సహాయక చర్యలకు రాష్ట్ర ప్రభుత్వం జిల్లాకు రూ.50 లక్షలను విడుదల చేసింది. ఈ నిధులను బాధితులను పునరావాస కేంద్రాలకు తరలించడం, సురక్షితమైన తాగునీరు, ఆహారం, పాలు సరఫరా చేయడం, వైద్య పరీక్షలు, శిబిరాల నిర్వహణ, పారిశుధ్యం, రోడ్లు, నీటిపారుదల ప్రాజెక్టులకు అత్యవసర మరమ్మతులకు కోసం వినియోగించుకోవాలని ప్రభుత్వం జిల్లా అధికారులకు సూచించింది. బాధితులను తరలించేందుకు ఆర్‌టీసీ బస్సులను అద్దెకు తీసుకోవాలని ఆదేశించింది. పాఠశాలలు, కళాశాలలను పునరావాస కేంద్రాలకు వినియోగించాలని కోరింది.

కంట్రోల్ రూమ్ నెంబర్లు

తుఫాను హెచ్చరికల నేపథ్యంలో కలెక్టరేట్‌తో పాటు వివిధ విభాగాలు, జిల్లా వ్యాప్తంగా డివిజన్లతో పాటు అన్ని మండల కేంద్రాల్లో కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేశారు. అత్యవసర సమాచారం, ఎటువంటి పరిస్థితుల్లో అయినా సాయం కోసం ప్రజలు ఆయా నెంబర్లకు ఫోన్ చేయవచ్చని అధికారులు ప్రకటించారు. 24 గంటలు అందుబాటులో ఉండేలా ప్రత్యేకంగా సిబ్బందిని కూడా నియమించినట్లు తెలిపారు. కంట్రోల్‌రూమ్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

- గుంటూరు కలెక్టరేట్ : 0863-2234014
- గుంటూరు నగర పాలక సంస్థ : 0863-2345103
- విద్యుత్ విభాగం : 9440817526
- ట్రాన్స్‌కో టోల్ ఫ్రీ నెంబర్ : 1912

ఆరోగ్యశాఖ.. మూడు అంచెల వ్యూహం

గుంటూరు మెడికల్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్యఆరోగ్య శాఖ మూడు అంచెల వ్యూహంతో సిద్ధమైంది. వైద్యులు ఎలా స్పందించాలి అనే అంశంతో పాటు వ్యాధులు ప్రబలకుండా, పునరావాస, ఇతర జాగ్రత్తలపై ప్రణాళిక రూపొందించింది. ఆస్పత్రుల్లో వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండాలని ఆదేశాలు జారీ అయ్యాయి. ఆరోగ్య కేంద్రాల్లో మందుల నిల్వ లతో పాటు అత్యవసర పరిస్థితుల్లో గర్భిణుల తరలింపుపై ప్రణాళిక రూపొందించింది. పునరావాస కేంద్రాల్లో వైద్య శిబిరాలపై సూచనలు జారీ అయ్యాయి. తుఫాన్ అనంతరం కాలనీలు, గ్రామాల్లో అంటువ్యాధులు ప్రబలకుండా, నీరు కలుషితం కాకుండా, పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా ఇతర ప్రభుత్వ శాఖల సమన్వయంతో కలసి పని చేయాలని వైద్య సిబ్బందికి ఆదేశాలు జారీ అయ్యాయి. ఎక్కడికక్కడ 108, 104, 102 అంబులెన్సులు సిద్ధంగా ఉంచుకోవాలని అధికారులను ఆదేశించారు.



పెదకాకాని శివాలయంలో నెలకొన్న భక్తుల రద్దీ

కార్తీక సందడి

ఆలయాల్లో భక్తుల దీపారాధనలు

అమరారామం వద్ద కృష్ణానదిలో పుణ్యస్నానాలు

అమరావతి, పెదకాకాని, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం తొలి ఆదివారం ఆలయాలకు భక్తులు పోటెత్తారు. కార్తీక దీపాలను వెలిగించి స్వామివార్లను దర్శించుకున్నారు. తెల్లవారుజాము నుంచి భక్తులతో ఆలయాల్లో సందడి నెలకొంది. పంచారామ క్షేత్రాలలో ప్రథమ ఆరామంగా పేరుగాంచిన అమరావతిలోని బాలచాముండికా సమేత అమరేశ్వరాలయంలో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. స్వామివారి దర్శనానికి ముందు భక్తులు పవిత్ర కృష్ణానదిలో పుణ్యస్నానాలు చేశారు. అనంతరం నదీతీరం, ఆలయ ప్రాంగణంలో కార్తీక దీపాలను వెలిగించారు. దూర ప్రాంతాల నుంచి వచ్చి ఉచిత దర్శనం చేసుకున్న భక్తులకు ఆలయంలో తీర్థప్రసాదాలు అందలేదు. ప్రశ్నించిన భక్తులపై అర్చకులు దురుసుగా సమాధానం చెప్పడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు. పెదకాకాని శ్రీమల్లేశ్వరస్వామి దేవస్థానంలో వేకువజాము నుంచే భక్తులు యజ్ఞాలబావి వద్ద పుణ్య స్నానాలు ఆచరించారు. అనంతరం ప్రదక్షిణలు చేసి దీపారాధనలు చేశారు. మల్లేశ్వరస్వామికి ప్రత్యేక అభిషేకాలు జరిపించుకున్నారు. ఆలయ ఉపకమిషనరు గోగినేని లీలాకుమార్ నిత్య అన్నప్రసాదాన్ని ప్రారంభించారు.

నేటి నుంచి మేధాదక్షిణామూర్తి మాలధారణ

నరసరావుపేట రూరల్: మేధా దక్షిణామూర్తి క్షేత్ర పాలకులుగా విరాజిల్లుతున్న కోటప్పకొండ త్రికోటేశ్వరస్వామి సన్నిదిలో ప్రథమ కార్తీక సోమవారం నుంచి మేధా దక్షిణామూర్తి మాలధారణ మండల దీక్ష కార్యక్రమం జరుగుతుందని ఆలయ కార్యనిర్వాహక అధికారి చంద్రశేఖర రావు తెలిపారు. డిసెంబరు 6న త్రికోటేశ్వరస్వామికి ఆరుద్రోత్సవం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా మండల దీక్ష తీసుకునే భక్తులు సోమ, మంగళవారాల్లో దీక్ష చేపట్టాలని సూచించారు. అర్థ మండల దీక్ష తీసుకునేవారు నవంబరు 14, 15 దీక్ష చేపట్టాలని తెలిపారు.



అమరావతి : కార్తీక దీపాలు వెలిగించి పూజలు చేస్తున్న మహిళలు

ప్రత్తిపాడులో వైసీపీకి షాక్

● జడ్పీటీసీ సహా ఐదుగురు ఎంపీటీసీలు రాజీనామా

ప్రత్తిపాడు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడులో వైసీపీకి ఎదురుదెబ్బ తగిలింది. ఎంపీపీ పదవి వ్యవహారంలో ఇప్పటికే రచ్చకెక్కిన వర్గపోరు తారాస్థాయికి చేరింది. ఈ క్రమంలో ప్రత్తిపాడు జడ్పీటీసీ విప్పాళ్ల కృష్ణారెడ్డితో పాటు ఐదుగురు ఎంపీటీసీలు రాజీనామా పార్టీకి రాజీనామా చేశారు. జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్‌గా పనిచేసిన షేక్ జిలాని కుమారుడైన, ప్రత్తిపాడు మండల పరిషత్ కోఆప్షన్ మెంబర్ షేక్ వసీమ్ కూడా పార్టీకి రాజీనామా చేశారు. ప్రత్తిపాడు ఎంపీటీసీ 2 గురుగూరి చాముండేశ్వరి(సాయి), గొట్టిపాడు ఎంపీటీసీ వాసిమళ్ల బూసి సువార్తమ్మ, నడింపాలెం 1 ఎంపీటీసీ వాసిమళ్ల మాణిక్యరావు, యనమదల ఎంపీటీసీ నేలపాటి స్వప్న, గనికపూడి ఎంపీటీసీ మదమంచి సురేష్‌బాబులు రాజీనామా చేసిన వారిలో ఉన్నారు. ఆయా సామాజిక వర్గాల్లో పట్టు ఉన్న ప్రజాప్రతినిధులు పార్టీకి రాజీనామాతో మండలంలో వైసీపీకి గడ్డుపరిస్థితులు నెలకొన్నాయని పలువురు భావిస్తున్నారు. ప్రత్తిపాడు ఉపసర్పంచ్ బాపతు వెంకటేశ్వరరెడ్డి, చేపర్తి లక్ష్మణ, ఉడుతూరి ఓం ప్రకాష్‌రెడ్డి, వాసిమళ్ల సన్నీ, ఉస్తేపల్లి చైతన్యరెడ్డిలు కూడా తమ పదవులకు రాజీనామా చేశారు. అంబటికి రాజీనామా సమర్పించే సమయంలో వైసీపీ సీనియర్ నేత వాడపల్లి ఫ్రాన్సిస్ కూడా ఉన్నారు. తొలి నుంచి బలసాని కిరణ్‌కుమార్‌ను వ్యతిరేకిస్తున్న ఒక సామాజిక వర్గానికి చెందిన నాయకులు కూడా రాజీనామాకు సిద్ధమవుతున్నట్లు తెలిసింది.



అంబటి రాంబాబుకు రాజీనామా పత్రం అందజేస్తున్న జడ్పీటీసీ విప్పాళ్ల కృష్ణారెడ్డి

ఎంపీపీ పదవిపై పట్టు

గత స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రత్తిపాడు ఎంపీపీ విషయంలో ఒప్పందంపై గొట్టిపాడుకి చెందిన బూసి సుబ్బారావు వర్గం పట్టువీడటం లేదు. రెండున్నరేళ్ల ఒప్పందం విషయంలో ప్రత్తిపాడు ఇన్‌చార్జితో పాటు జిల్లా, రాష్ట్ర స్థాయి నాయకుల వద్ద కూడా పంచాయతీ జరిగింది. అయితే జరిగిన చర్చలు విఫలం కావడంతో ఒక వర్గం ప్రత్తిపాడు ఇన్‌చార్జి బలసానిపై కత్తి దువ్వడం మొదలు పెట్టింది. మేకతోటి సుచరిత రంగప్రవేశంతో ఆమె వర్గంగా పేరున్న వారు ఒకతాటిపైకి వచ్చారు. ఈ క్రమంలో నాలుగు రోజుల క్రితం ఎంపీపీపై అవిశ్వాసం పెట్టడానికి ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు. రాజీనామా పత్రాలతో రెండు రోజులుగా అంబటి రాంబాబు వద్దకు నాయకులు వెళ్లారు. అయితే తొలుత రాజీనామా పత్రాలు తీసుకోవడానికి నిరాకరించని అంబటి ఆదివారం వారి నుంచి రాజీనామా పత్రాలను తీసుకున్నారు.

సాగర్ కుడి కాలువకు నీటి విడుదల నిలుపుదల

కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ పర్యటన వాయిదా

జేఆర్ఎఫ్ ప్రవేశ పరీక్షలో వ్యవసాయ కళాశాల విద్యార్థులకు ఉత్తమ ర్యాంక్‌లు

6

రైస్ కార్డులేవి?

● సా..గుతున్న స్మార్ట్ కార్డుల పంపిణీ ● రెండు నెలలుగా కొలిక్కిరాని ప్రక్రియ ● సచివాలయాల్లో పేరుకుపోయిన కార్డులు

గుంటూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): రెండు నెలల క్రితం మొదలైన రైస్ కార్డుల పంపిణీ ప్రక్రియ ఇంకా కొనసాగుతూనే ఉంది. స్మార్ట్ కార్డులను ముద్రించి పంపిణీ చేపట్టింది. కానీ అవి చేరాల్సిన వారికి చేరడానికి మాత్రం ఎక్కువ సమయం పడుతోంది. స్మార్ట్‌కార్డులను లబ్ధిదారులకు ఇళ్ల వద్ద అందజేయాలని ప్రభుత్వం ఆదేశించింది. అయితే ఈ ప్రక్రియ సక్రమంగా సాగడంలేదు. ఎక్కడికక్కడ సచివాలయాల్లో వందల సంఖ్యలో స్మార్ట్‌కార్డులు ఇంకా పంపిణీ కాకుండా పేరుకుపోయి ఉన్నాయి. లబ్ధిదారులు డీలర్లను అడిగితే సచివాలయాల సిబ్బంది అందజేస్తారని సమాధానం ఇస్తున్నారు. సచివాలయాల వద్దకు వెళ్లి మా కార్డులు ఏవి అంటే అప్పుడు తీసి వెతుకుతున్నారు. ఇళ్ల వద్ద పంపిణీ చేస్తామన్నారు కదా.. మాకు ఇవ్వలేదు అంటే తెలియదని సమాధానం ఇస్తున్నారు. జిల్లాలో ఇంకా అనేకమందికి కార్డుల పంపిణీ జరగకపోగా.. చాలామంది కార్డులు ఎక్కడ ఉన్నాయో కూడా తెలియడంలేదు. గుంటూరు జిల్లాలో రైస్ కార్డులు 5,99,558 ఉన్నాయి. వాటికి మరో 9 వేలు కొత్త రైస్ కార్డులను తాజాగా ఆమోదించారు. వీటితో కలిపి జిల్లాలో మొత్తం 6 లక్షల 10 వేల రైస్ కార్డులు రావాల్సి ఉంది. అయితే తొలివిడతగా ప్రభుత్వం జిల్లాకు 5,85,615 స్మార్ట్ రైస్ కార్డులను ముద్రించింది. కానీ కార్డుల పంపిణీ నత్తనడకన సాగుతోంది. ఇప్పటి వరకు జిల్లాలో 5,23,418 కార్డులను మాత్రమే పంపిణీ చేశారు. కాగా కొత్త కార్డులతో కలుపుకుని ఇంకా 80 వేల మందికి కార్డులు అందాల్సి ఉంది.

డిసెంబరులోనే కొత్త కార్డులు..

రైస్ కార్డుల విభజన, కొత్త రైస్ కార్డుల దరఖాస్తు ద్వారా కొత్తగా కార్డులు పొందే వారికి తొలివిడత పంపిణీ నిరాశ పరిచింది. కొత్తగా దరఖాస్తు చేసుకున్న వారికి పదిమందికి కూడా రైస్ కార్డులు రాలేదు. దీంతో వారంతా పాత కార్డుల్లోనే కొనసాగుతున్నారు. అధికారుల నిర్వాకంతో కార్డులున్న వారికే కార్డులు రాగా, కొత్తవారికి మాత్రం కార్డులు రాలేదు. వీరంతా డిసెంబరు వరకూ ఆగాల్సిందేనని, డిసెంబరులో రెండో విడతలో కొత్త కార్డులు పంపిణీ చేస్తామని చెబుతున్నారు.

దరఖాస్తుల ప్రక్రియలో జాప్యం

మేలో కొత్త రేషన్ కార్డుల దరఖాస్తుకు అవకాశం కల్పించింది. ఈ ప్రక్రియ మొత్తాన్ని రెండు నెలల వ్యవధిలో పూర్తిచేసింది. జిల్లాలో 52,000 దరఖాస్తులు రాగా వాటిని పరిష్కరించి ఆగస్టుకి స్మార్ట్ కార్డుల ముద్రణ ప్రక్రియను కూడా పూర్తి చేశారు. ఆగస్టు 31 నుంచి పంపిణీ చేపట్టగా ఇప్పటి వరకు రైస్ కార్డులు లబ్ధిదారులందరికీ అందలేదు.

ప్రకృతి ఒడిలో పరుగు

మూలపాడులో ట్రైమెట్రిక్స్ హ్యాపీ ఫారెస్ట్ రన్



అడవి మధ్యలో సాగుతున్న రన్





రన్‌లో ఉత్సాహంగా పాల్గొన్న యువతీ యువకులు

ప్రకృతి ప్రేమికులతో ఆహ్లాదకర వాతావరణంలో కొండ కోనల సవ్వడులను ఆస్వాదిస్తూ.. పక్షుల కిలకిలరావాలు.. సీతాకోకచిలుకల సోయగాల మధ్య మధురానుభూతిని అనుభవించాలనుకునే ప్రకృతి ప్రేమికుల హ్యాపీ ఫారెస్ట్ రన్ అద్భుతంగా సాగింది. పర్యాటకులకు ప్రకృతి మధురానుభూతులను పంచేందుకు 'ట్రైమెట్రిక్స్' సంస్థ మూలపాడు వద్ద నిర్వహించిన ఈ ట్రయల్ రన్ ఎన్టీఆర్ జిల్లాలోని ఇబ్రహీంపట్నం మండలం మూలపాడు కొండ కోనల్లో ఆదివారం జరిగింది. అటవీ శాఖ అధికారుల సహకారంతో రేస్ డైరెక్టర్ శ్రీనివాసరెడ్డి నేతృత్వంలో 'ట్రైమెట్రిక్స్' హెడ్ కోచ్ బి.రుషిల్ యాత్రను నిర్వహించారు. - (ఆంధ్రజ్యోతి, విజయవాడ సిటీ)





ఫారెస్ట్ రన్‌లో చిన్నారులు

కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ పర్యటన వాయిదా

గుంటూరు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మొంథా తుపాను కారణంగా కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అమరావతి పర్యటన వాయిదా పడింది. బుధవారం రాజధాని అమరావతిలో పలు ప్రధాన బ్యాంకుల కేంద్ర కార్యాలయాల శంకుస్థాన కార్యక్రమానికి ఆమె రాజధాని అమరావతికి రానున్నట్లు అధికారులు షెడ్యూల్ ప్రకటించారు. అయితే వచ్చే మూడు రోజులు మొంథా తుపాను ప్రభావం కారణంగా ఈ పర్యటనను నిర్మలా సీతారామన్ రద్దు చేసుకున్నారు. మళ్లీ షెడ్యూల్ ప్రకటిస్తామని కేంద్ర మంత్రి కార్యాలయం తెలిపింది.

సాగర్ కుడి కాలువకు నీటి విడుదల నిలుపుదల

విజయపురిసౌత్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మొంథా తుపాను నేపథ్యంలో నాగార్జున సాగర్ కుడి కాలువకు అధికారులు నీటిని నిలుపుదల చేశారు. ముందు జాగ్రత్త చర్యగా నీటిని నిలిపివేసినట్లు కుడి కాలువ గేట్స్ డీఈ శ్రీకాంత్ ఆదివారం తెలిపారు. తుపాను ముప్పు తగ్గిన అనంతరం మళ్లీ నీటిని విడుదల చేస్తామని చెప్పారు. తుపాను నేపథ్యంలో కుడి కాలువ ఆయకట్టు రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

305 టీఎంసీల నీటి నిల్వ..

సాగర్ జలాశయం నీటిమట్టం ఆదివారం నాటికి 587.50 అడుగులు ఉంది. ఇది 305.80 టీఎంసీలకు సమానం. ఎడమ కాలువ ద్వారా 2,872, ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా 33,576, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1,200, ఎల్ఎల్‌సీ ద్వారా 300 , మొత్తం ఔట్‌ఫ్లో 37,948 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు 37,948 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

సత్రశాలలో కొనసాగుతున్న విద్యుదుత్పత్తి

రెంటచింతల, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): సత్రశాలలోని నాగార్జున సాగర్ టెయిల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్టులో శనివారం అర్ధరాత్రి 12 గంటల వరకు 1.0723 ఎంయూల విద్యుదుత్పత్తి జరిగినట్లు ఎస్ఈ కె.వెంకటరమణ, ఈఈలు తెలిపారు. ప్రాజెక్టు 20 రేడియల్ క్రస్ట్ గేట్లకు గాను 2 గేట్లను 1.50 మీటర్, 1 గేట్‌ను 2 మీటర్ల మేర ఎత్తి 24,116, టేల్ రేస్ చానల్ ద్వారా 8,703.. మొత్తంగా 32,819 క్యూసెక్కుల నీటిని పులిచింతలకు విడుదల చేస్తున్నామన్నారు. ఎగువన సాగర్, ఎత్తిపోతల, హాలియా వాగుల నుంచి 3,3657 క్యూసెక్కుల నీరొస్తుందన్నారు. రిజర్వాయర్‌లో 75.50 మీటర్ల మేర నీరుండగా ఇది 7.080 టీఎంసీలకు సమానం.

డెల్టా కాల్వలకు నీటి విడుదల నిలిపివేత

తాడేపల్లి టౌన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాజెక్టుల నుంచి నీటిని విడుదల చేస్తుండడంతో ప్రకాశం బ్యారేజి వద్ద కృష్ణానది వరద ఉధృతి కొనసాగుతోంది. ఎగువన పులిచింతల ప్రాజెక్టుతోపాటు మున్నేరు, వెలగలేరు, కీసర తదితర ప్రధాన వాగుల నుంచి 52 వేల 60 క్యూసెక్కుల వరద నీరు ఇన్‌ఫ్లోగా నమోదు అవుతుండగా.. అంతే నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్టు ఇరిగేషన్ జేఈ రాజేష్ తెలిపారు. బ్యారేజి రిజర్వాయర్‌లో 11.6 అడుగుల నీటిమట్టం కొనసాగుతుండగా డెల్టా కాలువలకు నీటి విడుదల నిలిపివేసినట్టు తెలిపారు.

ప్రైవేట్ ట్రావెల్స్ కాదని.. ఆర్టీసీకి పరుగులు

- కర్నూలు దుర్ఘటన నేపథ్యంలో ట్రావెల్స్‌పై ఆర్టీఏ దాడులు
- ఆర్టీసీ బస్సులకు పెరిగిన ప్రయాణికుల తాకిడి
- కిటకిటలాడిన ఎన్టీఆర్ బస్టాండు
- చెన్నైకు అదనంగా మరో రెండు సర్వీసులు



ఎన్‌టీఆర్ బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ

గుంటూరు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్టీఆర్ బస్టాండులో ప్రయాణికుల రద్దీ పెరిగింది. కర్నూలులో బస్సు దగ్ధం దుర్ఘటనతో ప్రైవేటు ట్రావెల్స్‌పై ఆర్టీఏ అధికారుల దాడులు చేపట్టారు. దీంతో ఆర్టీసీకి ప్రయాణికుల తాకిడి పెరిగింది. ప్రయాణికుల రద్దీ ఈ వారం రెట్టింపయ్యింది. గుంటూరు నుంచి ప్రతి ఆదివారం చెన్నై, బెంగళూరు, హైదరాబాద్, వైజాగ్ వంటి దూర ప్రాంతాలకు సర్వీసులు పెద్ద ఎత్తున రాకపోకలు సాగిస్తుంటాయి. కాగా కర్నూలులో బస్సు దగ్ధం ఘటనతో ప్రజలను ఉలికిపాటుకు గురాయ్యారు. ప్రైవేటు ట్రావెల్స్ సర్వీసుల కంటే ఆర్టీసీయే మేలంటూ బస్టాండ్‌కు పెద్ద ఎత్తున చేరుకుంటున్నారు. రాత్రి గుంటూరు, తెనాలి నుంచి బెంగళూరుకు వెళ్లే సర్వీసులకు ప్రయాణికులు ఫుల్ అయ్యారు. మరో వైపు గుంటూరు నుంచి చెన్నై వెళ్లే సూపర్ లగ్జరీ సర్వీసు బుకింగ్ ఫుల్ అవటంతో అదనంగా మరో రెండు సర్వీసులు చెన్నైకు ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. ఇక హైదరాబాద్‌కు కూడా ప్రయాణికుల తాకిడి పెరిగింది. రద్దీకి అనుగుణంగా సర్వీసులు ఏర్పాటు చేస్తున్నట్లు ఎన్‌టీఆర్ బస్టాండ్ అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ (ఏటీఎం) సాంబశివ పేర్కొన్నారు. ప్రయాణికుల రద్దీని పర్యవేక్షించారు.

ఆజాద్‌కు తక్షణమే వైద్యసేవలు అందించాలి

- పౌర హక్కుల సంఘం రాష్ట్ర కార్యదర్శి చంద్రశేఖర్

గుంటూరు సిటీ, అక్టోబర్ 26(ఆంధ్రజ్యోతి): ఒడిశాలోని భువనేశ్వర్‌లో ఉన్న ఝర్‌పాడ హై సెక్యూరిటీ జైలులో అక్టోబర్ 15 నుంచి నిరవధిక నిరాహారదీక్ష చేస్తున్న మావోయిస్టు ఆజాద్‌కు తక్షణమే వైద్య సేవలు అందించాలని పౌర హక్కుల సంఘం రాష్ట్ర కార్యదర్శి చిలకా చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. ఆదివారం గుంటూరులో ఆయన మాట్లాడుతూ రాజకీయ ఖైదీ దున్నా కేశవరావు అలియాస్ ఆజాద్ ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తుందన్నారు. గత శుక్రవారం నాటికి నిరవధిక నిరాహా రదీక్ష తొమ్మిదో రోజుకు చేరుకున్న సందర్భంగా ఆజాద్‌ను భువనేశ్వర్‌లోని క్యాపిటల్ ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్చారని చెప్పారు. సుప్రీం కోర్టు ఆదేశాల ప్రకారం.. ఆయన తనపై నమోదైన అన్ని కేసులను త్వరగా పరిష్కరించడానికి ప్రత్యేక కోర్టులను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారన్నారు. అయితే ఆయన ప్రస్తుతం కాలేయానికి తీవ్రమైన ఇన్‌ఫెక్షన్ హెపటైటిస్‌తో బాధపడుతున్నారని, దీని వల్ల పరిస్థితి అత్యంత ప్రమాదకరంగా మారిందని తెలుస్తోందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో దున్నా కేశవరావుపై పెండింగ్‌లో ఉన్న కేసులను విచారించడానికి శ్రీకాకుళం జిల్లా గత శనివారం నుంచి ఒక ప్రత్యేక కోర్టు ఏర్పాటు అవుతున్నప్పటికీ, ఒడిశాలో ఆయనకు సంబంధించిన అనేక కేసులు ఇంకా పెండింగ్‌లో ఉన్న చోట ప్రత్యేక కోర్టు ఏర్పాటుకు సంబంధించి ఎటువంటి సమాచారం లేకపోవడం తీవ్ర ఆందోళన కలిగిస్తోందన్నారు.

జేఆర్ఎఫ్ ప్రవేశ పరీక్షలో..
వ్యవసాయ కళాశాల విద్యార్థులకు ఉత్తమ ర్యాంక్‌లు



జీఎస్ రంగనాథ్, 2వ ర్యాంక్



వి.ప్రత్యూష, 43వ ర్యాంక్



జి.బృహతి, 20వ ర్యాంక్

బాపట్ల, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఐసీఏఆర్-ఏఐఈఈఏ జాతీయ స్థాయి పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రవేశ పరీక్షలో బాపట్ల వ్యవసాయ కళాశాలకు చెందిన బీఎస్సీ (ఆనర్స్ ఏజీ) 2021 బ్యాచ్ విద్యార్థులు ఉత్తమ ర్యాంక్‌లు సాధించారని కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ పి.ప్రసూనా రాణి తెలిపారు. జీఎస్.రంగనాథ్.. ప్లాంట్ సైన్సెస్‌లో అఖిలభారత స్థాయిలో 2వ ర్యాంక్, వి.ప్రత్యూష ప్లాంట్ సైన్సెస్‌లో 43, మేడపాటి జీఎస్.సాహితి ప్లాంట్ బయోటెక్నాలజీలో 1, పి.హాస్నేన్‌ఖాన్ ప్లాంట్ బయోటెక్నాలజీలో 38, జి.బృహతి ఫిజికల్ సైన్సెస్‌లో 20, కె.మహిమ 161వ ర్యాంక్ సాధించారని వెల్లడించారు. అదేవిధంగా ప్లాంట్ సైన్సెస్, ఎంటమాలజీ, అగ్రానమిలో అనేక మంది విద్యార్థులు 10 నుంచి 50 ర్యాంకులు సాధించినట్లు చెప్పారు. ప్లాంట్ సైన్సెస్‌లో 20మంది విద్యార్థులు అర్హత సాధించగా ఎంటమాలజీలో 14, అగ్రానమిలో 13, ప్లాంట్ బయోటెక్నాలజీలో ముగ్గురు, సోషల్ సైన్సెస్‌లో ఇద్దరు, ఫిజికల్ సైన్సెస్, స్టాటిస్టికల్ సైన్సెస్‌లో జాతీయ స్థాయిలో 200 నుంచి 900 వరకు ర్యాంకులు సాధించి భారతదేశంలోనే ప్రముఖ విశ్వవిద్యాలయాలైన ఐఏఆర్ఐ న్యూఢిల్లీ, ఐఏఆర్ఐ రాంచి, ఐజీకేవీ ఛత్తీస్‌ఘడ్, రాయపూర్, టీఎన్ఏయూ కోయంబత్తూరు, ఐవీఆర్ఐ ఉత్తరప్రదేశ్, యూఏఎస్ ధార్వాడ్, ఎస్కే యూఎస్‌టీ కశ్మీర్‌లో సీట్లు పొందినట్లు ఆమె తెలిపారు. అధ్యాపకులు, విద్యార్థులను ఆమె అభినందించారు.

7 నుంచి వీవీఐటీయూలో బాలోత్సవ్

- ప్రచార ప్రతులు ఆవిష్కరించిన చాన్సలర్ విద్యాసాగర్



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న చాన్సలర్ వాసిరెడ్డి విద్యాసాగర్ తదితరులు

పెదకాకాని, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధిగాంచిన ప్రపంచ తెలుగు బాలల పండుగ బాలోత్సవ్ -2025 వాసిరెడ్డి వెంకటాద్రి ఇంటర్నేషనల్ టెక్నలాజికల్ యూనివర్శిటీ ప్రాంగణంలో వచ్చే నెల 7 నుంచి 9వ తేదీ వరకునిర్వహించనున్నట్లు వీసీ వాసిరెడ్డి విద్యాసాగర్ తెలిపారు. ఆదివారం గుంటూరులో బాలోత్సవ్ సాంస్కృతిక ఉత్సవాలకు సంబంధించిన ప్రచార ప్రతులను ఆయన ఆవిష్కరించారు. వాసిరెడ్డి విద్యాసాగర్ మాట్లాడుతూ విద్యార్థుల సృజనాత్మకత, నైపుణ్యాలను వెలికితీసేందుకు బాలోత్సవ్ ఒక మంచి వేదికన్నారు. రిజిస్ట్రార్ డాక్టర్ వై.మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ.. కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ, శాక్ విద్యార్థులు బాలోత్సవ్‌లో పాల్గొనే చిన్నారులకు సహకారం అందిస్తారని తెలిపారు. బాలోత్సవ్ విద్యార్థి సంధానకర్త టి.నవ్య మాట్లాడుతూ మూడు రోజులపాటు 20 అంశాలు 60 విభాగాలుగా ఈ పోటీలు నిర్వహించనున్నామని తెలిపారు. వక్తృత్వం, తెలుగు పద్యం, తెలుగులోనే మాట్లాడుదాం, శాస్త్రీయ, జానపద నృత్యం, సంగీతం వంటి సాంస్కృతిక అంశాలలో పోటీలు ఉంటాయని తెలిపారు. ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుంచి వచ్చే వారికి ఉచిత వసతి, భోజన సౌకర్యం కల్పిస్తామని చెప్పారు. రిజిస్ట్రేషన్ కోసం balotsav.in వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకున్న ఎంట్రీ ఫాంలను పూర్తిచేసి పోస్టు చేయొచ్చని లేదా వెబ్‌సైట్‌లోని గూగుల్ ఫాంను పూర్తిచేసి అప్‌లోడ్ చేయవచ్చని తెలిపారు. పూర్తి వివరాలకు బాలోత్సవ్ సంధానకర్త నందిరాజు శివరామకృష్ణను 73862 25336 నంబరుకు సంప్రదించాలన్నారు.

మొంథా తుపానుపై రైల్వే సన్నద్ధత ఏదీ?

- ఇప్పటి వరకు ఏర్పాటు చేయని హెల్ప్‌లైన్ నంబర్లు

గుంటూరు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ఒకపక్క మొంథా తుపాను సముద్ర తీరానికి కదులుతోందని ఐఎండీ హెచ్చరికలు జారీ చేస్తున్నప్పటికీ.. రైల్వే శాఖ నుంచి ఇప్పటి వరకు ఎలాంటి జాగ్రత్త చర్యలు చేపట్ట లేదు. కనీసం హెల్ప్‌లైన్ నంబర్లు కూడా ప్రకటించ లేదు. తుపాను ప్రభావం ఈ నెల 27, 28, 29 తేదీల్లో తీవ్రంగా ఉంటుందని వాతావరణ శాఖ హెచ్చరిస్తున్నప్పటికీ.. ప్రతిస్పందనగా రైల్వే శాఖ నుంచి ఎలాంటి బులెటిన్‌లు కూడా ఇప్పటి వరకు విడుదల కాలేదు. మొంథా తుపాను కాకినాడ వద్ద తీరం దాటొచ్చని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. తుపాను వల్ల గంటకు 90 నుంచి 100 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని, అలానే 28, 29 తేదీల్లో భారీ నుంచి అతి భారీ వర్షపాతం నమోదు అయ్యే అవకాశాలు ఉన్నాయని చెబుతోంది. గతంలో వచ్చిన తుపాన్లు కంటే దీని తీవ్రత ఎక్కువగా ఉంటుందని కూడా హెచ్చరిస్తోంది. దక్షిణ మధ్య రైల్వే హెడ్‌క్వార్టర్స్ నుంచి ఆదివారం సాయంత్రం వరకు డివిజన్ కార్యాలయాలకు ఎలాంటి ఆదేశాలు రాలేదని సమాచారం. ఐఎండీ చెబుతున్నట్లు భారీ వర్షాలు కురిస్తే రైల్వేస్టేషన్లు, రైలు మార్గాల్లోకి వర్షం నీరు చేరి నిలిచిపోయే ప్రమాదం ఉంటుంది. వాగుల్లో నీటి ప్రవాహాలు పెరిగి రైలు మార్గాలు దెబ్బతినే అవకాశాలుంటాయి. దీంతో రైలు ప్రమాదాలు జరిగేందుకు ఆస్కారం ఉంటుంది. ముందస్తు సమాచారం లేకుండా రైళ్ల రద్దు, దారి మళ్లింపులు చేస్తే ప్రయాణికులు ఇబ్బందులు పడతారు. విశాఖపట్నం - చెన్నై మార్గం అత్యంత రద్దీ రూట్లలో ఒకటిగా ఉంది. ఈ మార్గంలో గుంటూరు నుంచి విశాఖపట్టణం వైపునకు నిత్యం ఫలక్‌నుమా, జన్మభూమి, విశాఖ, ప్రశాంతి, అమరావతి(షాలిమార్), ఉదయ్, సింహాద్రి వంటి రెగ్యులర్ రైళ్లు ప్రయాణిస్తాయి. చెన్నై మార్గంలో నిత్యం చెన్నై, జనశతాబ్ది, వందేభారత్, నారాయణాద్రి, శబరి ఎక్స్‌ప్రెస్‌లు రాకపోకలు సాగిస్తుంటాయి. వేలాది మంది ప్రయాణికులు నిత్యం ప్రయాణం చేస్తుంటారు. ఈ నేపథ్యంలో మొంథా తుపానుని రైల్వే శాఖ తేలికగా తీసుకోకుండా తగిన సన్నద్ధత చర్యలు చేపట్టాలని రైల్వే వినియోగదారుల సంఘాల నాయకులు కోరుతున్నారు.

ఓవరాల్ ఛాంపియన్లుగా తూర్పుగోదావరి, విశాఖ

- ముగిసిన రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలు



వెయిట్ లిఫ్టింగ్ విజేతలతో జబీన్, శ్రీఅనిత, ఉన్నం ఝాన్సీరాణి

దుగ్గిరాల, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతోపాటుగా, క్రీడల్లోనూ రాణించాలని ఎంపీపీ జబీన్ పేర్కొన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో దుగ్గిరాల మండలం రేవేంద్రపాడు హైస్కూల్ ఆవరణలో జరుగుతున్న రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలు ఆదివారంతో ముగిశాయి. మెడల్స్ ప్రదానోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన జబీన్, శ్రీఅనిత మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం క్రీడాకారులకు ప్రోత్సాహం అందిస్తోందన్నారు. యార్డు ఛైర్‌పర్సన్ ఉన్నం ఝాన్సీరాణి మాట్లాడుతూ.. గతంలో ఉద్యోగావకాశాల్లో క్రీడాకారులకు ఒకశాతంగా ఉన్న కోటాను 3 శాతానికి పెంచిందన్నారు. మంత్రి లోకేశ్ క్రీడాకారుల కోసం అనేక సదుపాయాలను కల్పిస్తూ ప్రోత్సాహిస్తున్నారని కొనియాడారు. అండర్-19 విభాగం (బాలికలు) ఓవరాల్ ఛాంపియన్‌గా తూర్పుగోదావరి జిల్లా, రన్నర్‌గా పశ్చిమగోదావరి జిల్లా జట్లు నిలిచాయి. బాలుర అండర్- 19 విభాగం ఛాంపియన్‌గా విశాఖపట్నం జిల్లా, రన్నర్‌గా కడపజిల్లా జట్లు నిలిచాయి. అండర్-17 (బాలికలు) ఓవరాల్ ఛాంపియన్‌గా తూర్పు గోదావరి, రన్నర్‌గా పశ్చిమ గోదావరి జట్లు నిలిచాయి. అండర్-17 బాలుర విభాగంలో ఓవరాల్ ఛాంపియన్‌గా తూర్పుగోదావరి, రన్నర్‌గా కడప జట్లు ప్రతిభను చాటుకున్నాయి. మొత్తం పది కేటగిరీల్లో 13 జిల్లాల నుంచి వచ్చిన సుమారు 450 మంది పోటీల్లో పాల్గొన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి నాగ శిరీష, మాజీ కార్యదర్శి పీడీ మెల్లెంపూడి రవి, హెచ్‌ఎం బీవీ కృష్ణారావు, బి.శ్రీనివాసరావు, సీహెచ్ కొండయ్య, వి.రమేష్‌బాబు, బి.భాస్కరరావు, కె.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు వెల్దుర్తికి సీఎం చంద్రబాబు రాక

- ఎమ్మెల్యే జూలకంటి తనయుడి వివాహ రిసెప్షన్‌కి హాజరు
- సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన ఎస్పీ కృష్ణారావు
- పాల్గొననున్న మంత్రి నారా లోకేశ్



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ కృష్ణారావు

మాచర్ల/వెల్దుర్తి అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మాచర్ల నియోజకవర్గంలోని వెల్దుర్తికి సోమవారం సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేశ్ రానున్నారు. మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి తనయుడు జూలకంటి గౌతమ్‌రెడ్డి వివాహ రిసెప్షన్‌లో వీరు పాల్గొననున్నారు. ఈ మేరకు వెల్దుర్తిలోని టీటీడీ కల్యాణ మండపం ఎదురు దాదాపు పది ఎకరాల్లో పార్టీ శ్రేణులు, అధికారులు భారీ ఏర్పాట్లు చేశారు. జిల్లా ఎస్పీ కృష్ణారావు ఆదివారం సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలించారు. రిసెప్షన్, హెలిప్యాడ్, పార్కింగ్ ప్రాంతాలను సందర్శించి పోలీసు అధికారులకు పలు సూచనలు చేశారు. జేసీ సూరజ్ గనోరే కూడా ఏర్పాట్లను పరిశీలించారు. వీరి వెంట గురజాల ఇన్‌చార్జి వెంకటరమణ, మాచర్ల రూరల్ సీఐ నఫీజ్ బాషా, వెల్దుర్తి ఎస్ఐ సమందర్‌వలి, తహసీల్దార్ రాజశేఖర్‌నాయక్, ఎంపీడీవో ప్రసాద్ తదితరులు ఉన్నారు. సీఎం పర్యటించే ప్రాంతాన్ని జాగిలాలతో బాంబు స్క్వాడ్ బృందం తనిఖీలు జరిపింది. హెలిప్యాడ్ వద్ద ప్రత్యేక బృందాలు పరిశీలించాయి. హెలిప్యాడ్ నుంచి రిసెప్షన్ ప్రాంతానికి సీఎం చేరుకునేందుకు కార్‌వాన్ ఏర్పాటు చేశారు. ఎస్పీ, ముగ్గురు అడిషనల్ ఎస్పీలు, 27 మంది సీఐలు, 52 మంది ఎస్ఐలు, 750 మంది సిబ్బంది బందోబస్తు నిర్వహించనున్నారు. ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి, టీడీపీ యువనేతలు అక్కిరెడ్డి, చిరంజీవిరెడ్డితో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. 50 వేల మంది రిసెప్షన్‌కు హాజరుకావొచ్చని భావిస్తున్నారు. ప్రత్యేక వాటర్ ప్రూఫ్ టెంట్లు ఏర్పాటు చేస్తున్నారు.

పకడ్బందీగా భద్రతా చర్యలు

సీఎం పర్యటన నేపథ్యంలో అత్యంత పకడ్బందీగా భద్రతా చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్పీ కృష్ణారావు తెలిపారు. ట్రయల్ రన్ నిర్వహించిన అనంతరం మాచర్లలోని మానుకొండ కల్యాణ మండపంలో పోలీసు అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకొని డ్రోన్లు, కెమెరాలతో బందోబస్తు నిర్వహించనున్నామన్నారు. అడ్మిన్ ఏఎస్పీ జేవీ సంతోష్, ఏఆర్ అదనపు ఎస్పీ సత్తిరాజు, క్రైం అడిషనల్ ఎస్పీ లక్ష్మీపతి, ఇన్‌చార్జి డీఎస్పీ వెంకటరమణ, ఎస్‌బీ సీఐ సురేష్ బాబు పాల్గొన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.75 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	135, 144, 155
చికెన్ విత్ స్కిన్(కిలో)	260.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	270.00

తుఫాన్ సమర్ధవంతంగా ఎదుర్కోవాలి

- అధికారులను ఆదేశించిన నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర
- ఎక్కడ ప్రాణ, ఆస్తి నష్టం జరగకూడదు
- జీఎంసీలో సెంట్రల్ కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు



సమావేశంలో ప్రసంగిస్తున్న మేయర్ కోవెలమూడి రవీంద్ర, వేదికపైన కమిషనర్, అధికారులు

గుంటూరు(కార్పొరేషన్), అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్‌ను గుంటూరు నగరంలో ఎక్కడా ప్రాణ, ఆస్తి నష్టం జరుగకుండా అధికారులు, ప్రజాప్రతినిధులు సమష్టిగా సిద్ధంగా ఉండాలని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర కోరారు. ఆదివారం శ్రీవేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో మొంథా తుఫాన్ వల్ల ఇబ్బందులు కలగకుండా నగరంలో తీసుకోవలసిన ముందస్తు చర్యలపై కార్పొరేటర్లు, అధికారులు, సచివాలయ కార్యదర్శులతో నగర కమిషనర్ పులి శ్రీనివాసులు అత్యవసర సమావేశం నిర్వహించారు. మేయర్ మాట్లాడుతూ నగరంలో ఎటువంటి విపత్కర పరిస్థితులనైనా ఎదుర్కొనుటకు అధికారులు, కార్యదర్శులు సిద్ధంగా ఉండాలన్నారు. హుద్‌హుద్ వంటి ప్రమాదకర తుఫానులు వచ్చినప్పుడు సమర్థవంతమైన నాయకత్వం ద్వారా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రజలకు ఇబ్బంది లేకుండా సత్వర చర్యలు తీసుకున్నారని వారి నాయకత్వంలో ప్రస్తుత తుఫానును కూడా ఎదుర్కొందామన్నారు. కమిషనర్ మాట్లాడుతూ మొంథా తుఫాన్ రానున్న మూడు రోజులు తీవ్ర గాలులతో కూడిన భారీ వర్షాలు కురవనున్న నేపథ్యంలో, తుఫాన్ వల్ల నగరంలో ఆస్తి, ప్రాణనష్టం జరగకుండా ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు. మూడు రోజులు అధికారులు, కార్యదర్శులకు సెలవులు లేవని ప్రతి ఒక్కరు విధులు కేటాయించిన ప్రాంతంలో ప్రజలకు అందుబాటులో ఉండాల్సిందేన్నారు. రెండు వార్డులకు ఒక ప్రత్యేక అధికారితో కూడిన సెంట్రల్ కమాండ్ కంట్రోల్ రూమ్ (0863-2345103, వాట్సప్ నెంబర్ 9849908391) నగర పాలక సంస్థ కాన్ఫరెన్సు హాల్లో ఏర్పాటు చేశామని, క్షేత్ర స్థాయిలో ఏ విపత్కర పరిస్థితిని గుర్తించినా వెంటనే కంట్రోల్ రూమ్‌కి సమాచారం అందించాలన్నారు. గుంటూరు నగరంలో ప్రగతి నగర్, మురికిపేట, తుఫాన్‌నగర్, మూడువంతెనలు, కంకరగుంట ఆర్‌యూబీ, జియాఉద్దీన్ నగర్, యానాదికాలనీ, చంద్రబాబునాయుడు కాలనీ, తారకరామానగర్, ఏటీ అగ్రహారం, జన్ను షాహీద్ నగర్ వంటి 12 ప్రాంతాలను సమస్యాత్మక ప్రాంతాలుగా గుర్తించామని, ఆయా ప్రాంతాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సమావేశంలో ఏపీ హజ్ కమిటీ చైర్మన్ షేక్ హసన్ బాషా, డిప్యూటీ మేయర్ షేక్ సజీ లా, అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డిప్యూటీ కమిషనర్లు బి.శ్రీనివాసరావు, టి. వెంక టకృష్ణయ్య, సిటీ ప్లానర్ రాంబాబు, ఇన్‌చార్జ్ ఎస్ఈ సుందర్రామిరెడ్డి, కార్పొరేటర్లు, అధికా రులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నసీర్

ఎంఎస్ఎంఈలకు ప్రభుత్వ ప్రోత్సాహం

- తూర్పు ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో చిన్న, మధ్య తరహా పరిశ్రమల స్థాపనకు కూటమి ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటోందని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అన్నారు. గుంటూరు సిటీ బేరింగ్ డీలర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సం దర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఇంటికో పారిశ్రామికవేత్తను తయారు చేయా లనే లక్ష్యంతో సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారని తెలిపారు. విశాఖ గూగుల్ పరిశ్రమ ఏర్పాటు ద్వారా రాష్ట్రంలో లక్షల మందికి ఉపాధి అవకాశాలు రాబోతున్నాయని చెప్పారు. సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ ఆశయ సాధన మేరకు యువతకు 20 లక్షల ఉద్యోగాల కల్పన దిశగా అడుగులు వేస్తున్నామన్నారు. ఆటో పరిశ్రమకు ప్రోత్సాహకాలు అందిస్తున్నామని, తద్వారా ఎందరో కార్మికులు, వ్యాపారులు లబ్ధి పొందనున్నారని చెప్పా రు. ఇప్పటికే రాష్ట్రంలో నూతన పారిశ్రామిక విధానం ద్వారా కొత్త పరిశ్రమలకు ఎర్ర తివాచీ పరిచామన్నారు. గత ప్రభుత్వంలో పరిశ్రమలు పారిపోయాయని, ఇప్పుడు మళ్లీ ఆంధ్ర వైపు పారిశ్రామికవేత్తలు చూస్తున్నారని తెలిపారు.

ఇన్‌సర్వీస్ టీచర్లకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలి

- ఎమ్మెల్సీ ఆలపాటికి ఎన్‌టీఏ నాయకుల విజ్ఞప్తి

గుంటూరు(విద్య), అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని, రాష్ట్ర ప్రభుత్వం దీనిపై స్పందించి వెంటనే సుప్రీంకోర్టులో రిట్ పిటీషన్ వేయాలని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు నోబుల్ టీచర్స్ అసోసియేషన్ నాయకులు విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.హైమారావు. మాట్లాడుతూ టెట్‌పై ఉపాధ్యాయుల్లో భయాందోళనలు నెలకొన్నాయని, దీనిపై రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి సుప్రీంకోర్టులో రిట్ పిటీషన్ వేయాలని, కేంద్ర ప్రభుత్వంతో సంప్రదించి అవసరమైతే చట్ట సవరణ చేయాలని కోరారు. కార్యక్రమంలో గుంటూరు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.సాయి విశ్వనాథ్, ఎన్.భాస్కరరావు అసోసియేట్ అధ్యక్షుడు పి.లలిత బాబు, ఉపాధ్యక్షులు ఏవీ కృష్ణారావు, పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి కూ రపాటి రాజా, గుంటూరు నగర అధ్యక్షుడు కె.వి.రాఘవులు, ప్రధాన కార్యదర్శి టి.శ్రీనివాస్, గౌరవ అధ్యక్షులు కె.వేణుగోపాల్, ఉపాధ్యక్షుడు టి.రవి తదితరులు పాల్గొన్నారు.



ప్రజల వైద్యుడు డాక్టర్ ముద్దన హనుమంతురావు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కరణం బలరామకృష్ణమూర్తి, బొల్లేపల్లి సత్యనారాయణ తదితరులు

డాక్టర్ ముద్దన హనుమంతరావు జీవితం ఆదర్శప్రాయం

- మాజీ ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి

గుంటూరు(తూర్పు), అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ప్రజల వైద్యుడిగా, ఆధ్యాత్మిక, సామా జిక, రాజకీయ నాయకుడిగా మానవీయ విలువలతో జీవించిన డాక్టర్ ముద్దన హను మంతరావు జీవితం ఆదర్శప్రాయమని మాజీ ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి అన్నారు. స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి వారి దేవస్థానం, శ్రీపద్మావతి కల్యాణ వేదికపై ఆదివారం భారతి ధార్మిక విజ్ఞానపరిషత్ ఆధ్వర్యంలో డాక్టర్ వెన్నిశెట్టి సింగారావు గ్రంథస్థం చేసిన 'ప్రజల వైద్యుడు డాక్టర్ ముద్దన హనుమంతరావు' అనే పుస్తకాన్ని బొల్లేపల్లి సత్యనారాయణ ఆవిష్కరించారు. ముఖ్యఅతిథిగా హాజరైన బలరామకృష్ణ మూర్తి మాట్లాడుతూ వైద్యుడు జీవితాంతం విద్యార్థే అనే సిద్ధాంతంతో పనిచేసిన గొప్ప వ్యక్తి ముద్దన అని కొనియాడారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న సరస్వతి విద్యాపీఠం జిల్లా అధ్యక్షుడు వనమా పూర్ణచంద్రరావు, గ్రంథ రచయిత డాక్టర్ వెన్నిశెట్టి సింగారావు ప్రసంగించారు. సభకు డాక్టర్ జి.సీతారామయ్య అధ్యక్షత వహించగా డాక్టర్ కొసరాజు రవీం ద్రనాథ్, కొర్రపాటి రామారావు, పోలిశెట్టి జ్ఞానదేవ్ తదితరులు హనుమంతరావు సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా బొల్లేపల్లి సత్యనారాయణ లలితాంబ దంపతులను నిర్వా హకులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జనచైతన్య వేదిక అధ్యక్షుడు వి. లక్ష్మణరెడ్డి, ఏలూరి సూర్యనారాయణ, డాక్టర్ పాకనాటి సూర్యకుమారి, సీహెచ్ వై శ్రావ ణిసురేష్, వేణుగోపాల్, ముక్తా ప్రభాకర్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యలో సమగ్ర మార్పులు అవసరం

- యూటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఎన్ కుసుమకుమారి

గుంటూరు(విద్య), అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ విద్యారంగంలో ఎంతసేపూ ఉపాధ్యాయులనే బాధ్యులను చేస్తూ మార్పులు ఎన్ని తెచ్చినా అది సంపూర్ణ విద్యా సాధనకు దోహదపడదని యూటీఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షురాలు ఎన్ కుసుమకుమారి అన్నారు. ఆదివారం యూటీఎఫ్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో కుసుమకుమారి మాట్లాడుతూ ప్రభుత్వ విద్యారంగం అభివృద్ధి చెందాలంటే ప్రభుత్వంతోపాటు ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల కృషి అవసరమని అన్నారు. ఉపాధ్యాయులకు శిక్షణ, తనిఖీ, పరీక్షలు తప్ప ప్రభుత్వం, తల్లిదండ్రుల విధానం ఏమి మారింది. జవాబుదారీ తనం ఎక్కడుందని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రచురణల కమిటీ చైర్మన్ ఎం.హనుమంతరావు మాట్లాడుతూ ఇన్ సర్వీస్ టీచర్లకు టెట్ పరీక్ష మినహాయింపు కోరుతూ ప్రభుత్వం సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ వేయాలన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం కళాధర్ మాట్లాడుతూ పీఎఫ్, ఏపీ జీఎల్ఐ లోన్లు, క్లోజర్లు జాప్యం లేకుండా వెంటనే ప్రభుత్వం చెల్లించాలి అన్నారు. కార్యక్రమంలో జిల్లా సహాధ్యక్షుడు జి.వెంకటేశ్వర్లు జిల్లా కోశాధికారి ఎండీ దౌల, జిల్లా కార్యదర్శి సీహెచ్ ఆదినారాయణ కె.సాంబశివరావు, టి.ఆంజనేయులు, ఎండీ షకీలాబేగం, ఎం గోవిందయ్య. ఆడిట్ కమిటీ కన్వీనర్ ఎ.శ్రీనివాసరావు, సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్.కుసుమకుమారి

ఎల్ఐసీ నిధులను అదానీకి కట్టబెట్టడం హేయం

గుంటూరు(తూర్పు), అక్టోబరు 26(ఆంధ్ర జ్యోతి): ఎల్ఐసీ నిధులను పారిశ్రామికవేత్త అదానీకి కట్టబెడుతున్న ప్రధాని మోదీ నిర్ణయం హేయమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జంగాల అజయ్‌కుమార్ విమర్శించారు. కొత్తపేటలోని మల్లయ్య లింగం భవన్‌లో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలు కష్టపడి పొదుపుగా పెట్టిన ఎల్ఐసీ సొమ్మును కార్పొరేట్ శక్తులకు అప్పజెప్పడం సరైనది కాదన్నారు. ఇటు వంటి చర్యలతో దేశ ఆర్థిక వ్యవస్థ పూర్తిగా నాశనం అవుతుందని పేర్కొన్నారు. మోదీ నిర్ణయానికి వ్యతిరేకంగా ప్రజలు, ఎల్ఐసీ ఉద్యోగులు తిరగబడాలని పిలుపునిచ్చారు.



మాట్లాడుతున్న జంగాల అజయ్‌కుమార్



పరుగుపందెంలో పాల్గొన్న మాస్టర్ అథ్లెటిక్స్

ఉత్సాహభరితంగా మాస్టర్ అథ్లెటిక్స్ జిల్లా మీట్

గుంటూరు(తూర్పు), అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో మాస్టర్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా స్థాయి మాస్టర్ అథ్లెటిక్ మీట్ జరి గింది. పలు అంశాల్లో అథ్లెటిక్స్ ఉత్సాహంగా పాల్గొని, తమ ప్రతిభను చూపారు. ఈ సం దర్భంగా అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ లాల్ వజీర్ మాట్లాడుతూ 30+ నుంచి 80+ వరకు మహిళలు, పురుషులు విభాగాల్లో దాదాపు 120 క్రీడాకారులు పాల్గొన్నారని అన్నారు. విజేతలు బాపట్లలో డిసెంబరు 13, 14 తేదీల్లో జరిగే రాష్ట్ర మీట్‌లో పాల్గొం టారని తెలిపారు. ఆ పోటీల్లో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన వారు రాజస్థాన్‌లో జరి గే జాతీయ మీట్‌కు అర్హత సాధిస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి కోటేశ్వరరావు, నజీర్, ఫ్లోరా, మస్తాన్‌వలీ, సురేష్, కిషోర్, డాక్టర్ ఖాదర్, మూర్తి, విజయ్, శేషయ్య, బాలకోటయ్య తదితరులు పాల్గొన్నారు.

డీఏ విడుదల ప్రకటన హర్షణీయం

- ప్రభుత్వ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు చంద్రశేఖర్

గుంటూరు(తూర్పు), అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగులకు ఒక డీఏను విడుదల చేస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి ప్రకటనపై ఆల్ ఆంధ్రప్రదేశ్ ప్రభు త్వ నాలుగో తరగతి ఉద్యోగుల కేంద్ర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ చంద్రశేఖర్ హర్షం వ్యక్తం చేశారు. స్థానిక ఏపీ ఎన్జీజీవో హోమ్‌లో ఆదివారం సంఘ రాష్ట్ర సెక్రటేరియెట్ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఏపీజేఏసీ చైర్మన్ విద్యాసాగర్ వినతితో తొలుత ఇచ్చిన జీవోను పునఃసమీక్ష చేసిన చంద్రబాబునాయుడుకు ధన్యవాదాలు తెలుపు తున్నట్టు పేర్కొన్నారు. డీఏతో పాటు ఉద్యోగులకు రావాల్సిన జీపీఎఫ్, పదవీ విరమణ పొందిన తర్వాత రావాల్సిన సదుపాయాలను అందించాలని కోరారు. నాలుగో తరగతి ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈ సమావేశంలో వీఎస్. సాయి రాం, కె.సుబ్బనారాయణ, మాణిక్యాలరావు, ఎన్.ఎల్లయ్య, కే.శ్రీనివాసరావు, పి.సాంబయ్య, మహేష్, నరేష్, విజయ్ ప్రసాదు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎన్.చంద్రశేఖర్, పాల్గొన్న సంఘ సభ్యులు

అలరించిన సినీ సంగీత విభావరి



సినీ గీతాలను ఆలపిస్తున్న గాయకులు

గుంటూరు(తూర్పు), అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన్ గార్డెన్స్, శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై ఆదివారం మహతీ స్వరసుధ ఆధ్వర్యంలో జరిగిన సినీ సంగీత విభావరి ప్రేక్షకులను ఆకట్టుకుంది. కార్యక్రమానికి గౌరవ అతిధులుగా గుళ్ళపల్లి సేవా సంస్థ కన్వీనర్ గుళ్ళపల్లి రాఘవేంద్రరావు, ఆతుకూరి వెంకట లక్ష్మి, ఎడ్యుకేషనల్ ట్రస్ట్ చైర్మన్ ఆతుకూరి సుబ్బారావు, విశ్రాంత ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ చందు వేంకటాద్రి, ఆలయ పాలకమండలి అధ్యక్షుడు సీహెచ్ మస్తానయ్య జ్యోతి ప్రజ్వ లన చేసి కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా గాయని, గాయకులు కే. రసూల్‌బాబు, సురభి శ్రావణి, ఎస్. కమల్‌కిశోర్, జీ హారిక, పత్రినిర్మల, సీహెచ్ రాజ్య లక్ష్మి, బీ కృష్ణప్రసాదు, మధులత, ప్రహర్షిత సినీ గీతాలను ఆలపించి అభిమానులను అల రించారు. కార్యక్రమాల్ని స్వరసుధ వ్యవస్థాపక అధ్యక్షురాలు పత్రి నిర్మల పర్యవేక్షించారు.

అభ్యుదయ వాది దావులూరి సాంబశివరావు మృతి



దావులూరి సాంబశివరావు

గుంటూరు(తూర్పు), అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): అభ్యుదయవాది, సీపీఎం సానుభూతి పరుడు దావులూరి సాంబశివరావు (85)ఆదివారం మృతి చెందారు. ఆయనకి భార్య శివ నాగమ్మ, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమార్తె ప్రొఫెసర్ రాజ్యలక్ష్మి జేఎన్‌టీయూ, గురజాడ యూనివర్సిటీ వీసీగా పని చేశారు. కుమారుడు డి.వీరప్రసాదు అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నారు. సాంబశివరావు ఆర్మీలో విధులు నిర్వహించారు. కమ్యూనిస్టు దిగ్గజం పుచ్చలపల్లి సుందరయ్య అంటే సాంబశివరావుకు విపరీతమైన అభిమానం. అందుకే ఆయన నివాసంలో సుందరయ్య విగ్రహాన్ని ఏర్పాటు చేసుకున్నారు. నవభారత్ నగర్‌లోని ఆయన నివాసంలో సాంబశివరావు భౌతికకాయానికి నివాళులర్పించిన వారిలో సీపీఎం నాయకులు ఎన్.కాళిదాసు, కె.నళిని కాంత్, ముత్యాలరావు, ఖాసీం షహీద్, మస్తాన్ వలి, కళ్యాణి తదితరులు ఉన్నారు. నేడు స్తంభాలగరువు మహాప్రస్థానంలో అంత్యక్రియలు నిర్వహిస్తామని కుటుంబసభ్యులు తెలిపారు.

సమర్థవంతంగా విధులు నిర్వహించండి

- ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాలు

గుంటూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): 'పోలీస్ ప్రతిష్ఠ కాపాడే విధంగా సమర్థవం తంగా విధులు నిర్వహించాలని ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాలు జారీ చేశారు. పోలీస్ కమ్యూనికేషన్ వ్యవస్థ ద్వారా జిల్లాలో అన్ని పోలీస్‌స్టేషన్ అధికారులతో సమీక్ష నిర్వహిం చారు. పోలీస్ సిబ్బంది ఎల్లప్పుడూ లాఠీ, విజిల్ తమతో పాటు ఉంచుకోవాలన్నారు. వాటి ని చట్టపరిధిలో వినియోగించాలన్నారు. వృద్ధులు, దివ్యాంగులు, మహిళలు పోలీస్‌స్టేషన్ల కు వచ్చినప్పుడు మర్యాదగా వ్యవహరించాలని కోరారు. రౌడీ మూకలపై కఠిన చర్యలు తీసుకోవాలని, వారికి తరచుగా కౌన్సెలింగ్ ఇవ్వాలని సూచించారు. మహిళల భద్రత కోసం శక్తి టీమ్స్ చురుకుగా క్షేత్రస్థాయిలో తిరుగుతూ, స్కూల్స్, కాలేజీల వద్ద గస్తీ నిర్వహించి, ఈవ్‌టీజింగ్ అరికట్టేలా చూడాలన్నారు.

రాష్ట్ర సదస్సును జయప్రదం చేయండి



మాట్లాడుతున్న డి.సూరిబాబు, పాల్గొన్న యూనియన్ నాయకులు

గుంటూరు(తూర్పు), అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): విద్యుత్ ప్రైవేటీకరణ విధానాలను వ్యతిరేకిస్తూ నవంబరు 4న తిరుపతిలో జరిగే రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్(యూఈఈయూ) రాష్ట్ర అధ్యక్షుడు డి.సూరిబాబు తెలిపారు. బ్రాడీపేట, సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం యూనియన్ జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విద్యుత్ ప్రైవేటీకరణ విధానాలను శరవేగంగా అమలు చేస్తోందన్నారు. అక్టోబరు 9న కేంద్ర ప్రభుత్వం విద్యుత్ సవరణలు ప్రతిపాదిత ముసాయిదా బిల్లును ముందుకు తెచ్చి రాష్ట్రాల అభిప్రాయాలు కోరుతుందని వివరించారు. ఈ ప్రైవేటీకరణ విధానాలకు వ్యతిరేకంగా జరిగే రాష్ట్ర సదస్సులో ఉద్యోగులు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశానికి డిస్కమ్ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించగా, కార్యక్రమంలో రాజు, వీరాంజనేయులు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

గుంటూరు(తూర్పు), అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): శంకర్ కంటి ఆస్పత్రి, బీజేపీ ఆధ్వ ర్యంలో స్థానిక 55వ డివిజన్‌లో ఆదివారం నిర్వహించిన కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. బీజేపీ నాయకులు గట్టుపల్లి అబ్రహం ఆధ్వర్యంలో జరిగిన శిబిరం లో సుమారు 200మంది వృద్ధులకు కంటి పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశా రు. శిబిరంలో పాల్గొన్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు మాట్లా డుతూ శంకర్ కంటి ఆస్పత్రి సేవలు అభినందనీయమన్నారు. పౌష్టికాహారాన్ని తీసుకుని కంటి చూపుపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో బీజేపీ నాయ కులు టి.లక్ష్మణరావు, రాజశేఖర్, నాగయ్య, కుమార్, చరకకుమార్ గౌడ్, బజరంగ్ రామ కృష్ణ, తోట శ్రీనివాస్, ఎమ్మార్పీఎస్ నాయకులు కుమార్ పాల్గొన్నారు.



వృద్ధులకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు, పాల్గొన్న బీజేపీ నాయకులు

అలరించిన శాస్త్రీయ సంగీత గాత్ర కచేరి

గుంటూరు(తూర్పు), అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): స్థానిక లక్ష్మీపురం, త్యాగరాజ కళా వేదిక సంస్థ వేదికపై త్యాగరాజ సాంస్కృతిక సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 29 వరకు జరిగే వాగ్గేయకార మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. కార్యక్రమాల్లో భాగంగా రెండో రోజున విద్వాన్ సాకేతరమన్, చెన్నై వారి శాస్త్రీయ సంగీత గాత్ర కచేరి సంగీతాభిమానులను అలరించింది. వీరికి వయోలిన్‌పై డాక్టర్ కే వీ కృష్ణ, మృదంగంపై బుర్రా శ్రీరామ్, ఘటంపై ఎం హరిబాబు చక్కటి వాయిద్య సహకారాన్ని అందించారు. తొలుతగా లఘు కచేరీలలో భాగంగా పట్నం సుబ్రహ్మణ్య అయ్యర్, పురందరదాసు, బాలసుబ్రహ్మణ్యన్, డాక్టర్ మంగళంపల్లి బాలమురళి రచనలను వై సంపూర్ణ రాజ్యలక్ష్మి గాత్రంతో, ఆర్ ఫణితేజ వేణువుతో, డాక్టర్ ఆకెళ్ళ రమణసాయి వీణపై శ్రావ్యంగా పలికించారు. కళా కారులను సంస్థ సభ్యులు ఎస్ గిరిజాశంకర్, నేతి విశ్వేశ్వరరావు, వల్లూరి కృష్ణ కిశోర్ ఘనంగా సత్కరించారు.



త్యాగరాజ కీర్తనలను ఆలపిస్తున్న సాకేత రమన్

అత్యవసరమైతే తప్పా బయటికి రావొద్దు

- కలెక్టర్ అన్సారియా విజ్ఞప్తి



మీడియాతో మాట్లాడుతోన్న కలెక్టర్ అన్సారియా

గుంటూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మొంథా తుపాను దృష్ట్యా రానున్న మూడు రోజుల్లో అవసరమై తేనే ప్రజలు బయటికి రావాలని కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా విజ్ఞప్తి చేశారు. మూడు రోజులకు అవసర మైన ఆహార సామగ్రిని ఇళ్లలో సిద్ధంగా ఉంచు కోవాలని సూచించారు. ఆదివారం కలెక్టరేట్‌లో ఆమె మీడియాతో మాట్లాడారు. ఈ నెల 27, 28, 29 తేదీల్లో జిల్లాలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని చెప్పారు. కలెక్టర్ కార్యాలయం సహా డివిజన్, మండల కార్యాలయాల్లో కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేశామని చెప్పారు. మూడు రోజులపాటు ప్రభుత్వ ప్రైవేటు, విద్యా సంస్థల(పాఠశాలలు, కళాశాలల)కు సెలవులు ప్రకటించారని కలెక్టర్ తెలిపారు. నగరపాలక సంస్థ పరిధిలో 12 లోతట్టు ప్రాంతాలను గుర్తించామని వారిని అవసరమైతే తక్షణం పునరావాస కేంద్రాలకు తరలించుటకు సిద్ధంగా ఉన్నామని అన్నారు. తాగునీటికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. తుఫాను అనంతరం పారిశుధ్యం, వైద్యసేవలు కూడా సిద్ధం చేశామని తెలిపారు.

ప్రజలందరూ అప్రమత్తంగా ఉండండి

- పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి

గుంటూరు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాను ప్రభావంతో 27, 28, 29 తేదీల్లో గుంటూరులో కూడా భారీ వర్షాలు, బలమైన ఈదురుగాలులు వీచే అవకాశం ఉన్నందున ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే గళ్ళా మాధవి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రజలు అవసరం అయితే తప్ప ఇళ్ల నుంచి బయటకు రాకుండా సురక్షి తంగా ఉండాలని సూచించారు. చెట్ల కింద, హోర్డింగ్‌లు, విద్యుత్ స్తంభాల సమీపంలో నిలబడరాదని సూచించారు. ప్రభుత్వం ముందస్తు చర్యల్లో భాగంగా నగరంలోని ప్రతి డివిజన్‌కు ఒక అధికారి నియమించినట్లు, అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు ఆ అధికారు లను సంప్రదించాలని సూచించారు. తుఫాను ప్రభావాన్ని తగ్గించేందుకు పోలీసు, ట్రాఫిక్, ఫైర్, మున్సిపల్ శాఖలతో సమన్వయం చేసుకుని ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులకు ఎమ్మెల్యే గళ్ళా మాధవి సూచించారు.

మొంథా తుఫానుపై విద్యుత్ యంత్రాంగం అప్రమత్తం

- సర్కిల్, డివిజన్ కార్యాలయాల్లో కంట్రోల్ రూమ్‌ల ఏర్పాటు
- ఎస్ఈ చల్లా రమేష్



ఎస్ఈ రమేష్

గుంటూరు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాను ముంచుకొస్తోన్న నేపథ్యంలో ఉమ్మడి గుంటూరు జిల్లాలో విద్యుత్ యంత్రాంగం అప్రమత్తమైంది. ఉమ్మడి జిల్లా పరిధిలోని గుంటూరు, పల్నాడు, సీఆర్‌డీఏ, బాపట్ల సర్కిల్ కార్యాలయాలతో పాటు డివిజన్ కార్యాలయాల్లో ప్రత్యేక కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు ఏర్పాటు చేశారు. మొంథా తుఫాన్‌పై విద్యుత్‌శాఖ ఆపరేషన్ - మెయింటెనెన్స్ (ఓఅండ్ఎం) అధికారులు, సిబ్బంది అప్రమ త్తంగా ఉండాలని ఇప్పటికే ఏపీ సీపీడీసీఎల్ సీఎండీ పుల్లారెడ్డి, టెక్నికల్ డైరెక్టర్ ఆవుల మురళీకృష్ణ యాదవ్‌లు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. దాంతో గుంటూరు సర్కిల్ కార్యాలయం సంగడిగుంట విద్యుత్ భవన్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు ఆపరేషన్ ఎస్ఈ చల్లా రమేష్ తెలిపారు. ప్రజలు విద్యుత్‌పరమైన సమస్యలపై కంట్రోల్ రూమ్ నెంబరు 9440817526కు ఫోన్ చేయాలని సూచించారు. అలానే సీఆర్‌డీఏ కార్యాలయంలో ఆపరేషన్ ఎస్ఈ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. సర్కిల్ కార్యాలయాలతో పాటు డివిజన్ కార్యాలయాల్లోనూ 29వ తేదీ వరకు కంట్రోల్ రూమ్‌లు అందుబాటులో ఉండేలా ఏర్పాటు చేశారు. తుఫాను ప్రభావంతో విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఏర్పడితే త్వరగా విద్యుత్ పునరుద్ధరణ పనులు చేపట్టేలా ఆపరేషన్ సిబ్బందిని అందుబాటులో ఉంచారు. తుఫాను ప్రభావంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయినా యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరణ పనులు చేపట్టనున్న ట్లు గుంటూరు సర్కిల్ ఆపరేషన్ ఎస్ఈ చల్లా రమేష్ తెలిపారు.

నేడు ఎస్పీ కార్యాయలంలో గ్రీవెన్స్ రద్దు

గుంటూరు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ దృష్ట్యా నేడు పోలీస్ కార్యాల యంలో నిర్వహించవలసిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం తాత్కాలికంగా రద్దు చేసినట్లు ఎస్పీ వకుల్ జిందాల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపా రు. ఈ విషయం దృష్టిలో ఉంచుకుని ప్రజలు పోలీస్ కార్యాలయానికి రావద్దని సూచించారు. తుఫాన్ నేపథ్యంలో ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో సమీప పోలీస్ స్టేషన్ లేదా డయల్ 112 నంబర్ ద్వారా వెంటనే పోలీస్ సహాయం పొందవచ్చని తెలిపారు.

భర్త గొంతు నులిమి చంపిన భార్య

- అనుమానాస్పద మృతి కేసులో ఐదు నెలలకు వీడిన మిస్టరీ

గుంటూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి) : స్థానిక పట్టాభిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని నేతాజీ నగర్‌లో అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఫైనాన్స్ వ్యాపారి ఖాజా కేసులో ఐదు నెలలకు మిస్టరీ వీడింది. భార్యే... భర్త ఖాజాను గొంతునులిమి చంపినట్లు తేలింది. విశ్వసనీయ వర్గాల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. నేతాజీ నగర్‌కు చెందిన షేక్ ఖాజా ఫైనాన్స్ వ్యాపారం చేస్తుంటాడు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె సంతానం ఉన్నారు. మద్యం సేవిస్తూ ఖాజా భార్యను వేధింపులకు గురి చేయడం, అనుమానంతో సూటిపోటు మాటలతో వేధించడం చేస్తుండేవాడు. దీంతో భార్యాభర్తల మధ్య తరచూ ఘర్షణలు చోటు చేసుకుంటుండేవి. భర్త వేధింపులు రోజురోజుకు అధికం అవుతుండడంతో భర్తను వదిలించుకోవాలని భార్య పథకం రూపొందించింది. భర్త నిద్ర పోయిన తర్వాత దివాన్ కాట్ దిండుతో ముఖంపై నొక్కి హత్య చేసింది. తర్వాత రోజు ఉదయం తనకి ఏమీ తెలియదు అన్నట్లుగా, అనారోగ్యంతో మృతి చెందినట్లుగా సృష్టించింది. కాగా ఖాజా అంత్యక్రియలకు ఏర్పాట్లు జరుగుతున్న సమయంలో బంధువుల నుంచి పోలీసులకు సమాచారం రావడంతో పోలీసులు ఖాజా మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. అనుమానాస్పద మృతిగా పోలీసులు కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం నివేదికలో ఖాజాది సహజ మరణం కాదని, హత్య చేసినట్లు నిర్ధారణ అయింది. దీంతో పట్టాభిపురం సీఐ గంగా వెంకటేశ్వర్లు అనుమానాస్పద మృతి కేసును హత్య కేసుగా మార్చారు.

బిల్డింగ్ నుంచి జారిపడి బేల్దారి కూలి మృతి


స్థానిక పట్టాభిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలకలూరు రోడ్డులో కరెంట్ ఆఫీస్ పక్కన ఉన్న అన్న క్యాంటీన్ వద్ద నిర్మాణంలో ఉన్న ఇంటి రెండో అంతస్తు నుంచి జారిపడి బేల్దారి కూలి మృతి చెందాడు. పోలీసులు, మృతుడి కుటుంబ సభ్యుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పేరేచర్లకు చెందిన బండ్లపాటి వెంకటేశ్వర్లు బేల్దారి కూలి పనులకు వెళ్తుంటాడు. కొద్దిరోజులుగా పలకలూరులోని గుర్రాల పాములయ్య ఇంటి నిర్మాణ పనులకు వెళ్తున్నాడు. దీనిలో భాగంగా వెంకటేశ్వర్లు ఈ నెల 25న ఉదయం పాములయ్య ఇంటిలో పనులకు వెళ్ళాడు. రెండో అంతస్తు మెట్లు వద్ద పని చేస్తూ కాలుజారి కిందపడ్డాడు. దీంతో ఆయన తలకు, వెన్నుపూసకు బలమైన గాయాలయ్యాయి. అపస్మారకస్థితిలోకి వెళ్ళాడు. దీంతో ఆయనను వెంటనే సమీపంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం వెంకటేశ్వర్లు మృతి చెందాడు. భార్య చిన్ని ఫిర్యాదు మేరకు పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హౌసింగ్ బోర్డు వద్ద కారు బోల్తా

నల్లపాడు పోలీస్‌స్టేషన్ పరిధిలోని హౌసింగ్ బోర్డు కాలనీ వద్ద ఆదివారం ఒక కారు బోల్తా కొట్టింది. పేరేచర్ల వైపు నుంచి గుంటూరు వైపునకు వస్తున్న కారు హౌసింగ్ బోర్డ్ కాలనీ సమయపానికి రాగానే డివైడరును ఢీకొట్టి ఒకసారిగా పల్టీ కొట్టింది. వెంటనే అప్రమత్తమైన స్థానికులు హుటాహుటిన కారులో ఉన్న వారిని బయటకు తీశారు. అదృష్టవశాత్తు వారికి ఎటువంటి గాయాలు కాలేదు. అదే సమయంలో వెనుక నుంచి వస్తున్న భారీ వాహనాన్ని డ్రైవర్ సమయస్ఫూర్తితో నిలిపేయడంతో మరో ప్రమాదం తప్పినట్లు అయింది. స్థానికుల సహాయంతో బాధితులు వెళ్లిపోయారు.

దిక్సూచి

ఇండియన్ ఆర్మీలో
టెక్నికల్ ఎంట్రీ స్కీమ్



మొత్తం ఖాళీలు: 90

ఇండియన్ ఆర్మీలోని 10 ప్లస్ 2 టెక్నికల్ ఎంట్రీ స్కీమ్(టీఈఎస్) కోర్సులో ప్రవేశాల కోసం అవివాహితులైన పురుష అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను కోరుతున్నారు. ఇందులో ఎంపికైన వారికి బీటెక్ డిగ్రీతోపాటు, సైన్యంలో లెఫ్టినెంట్ ఉద్యోగంలో చేరవచ్చు.

కోర్సు:

టెక్నికల్ ఎంట్రీ స్కీమ్ 55 కోర్సు(టీఈఎస్) - 2025 జూలై 2026

అర్హత: కనీసం 60 శాతం మార్కులతో ఇంటర్ పూర్తి చేసి ఉండాలి. అయితే ఇంటర్‌లో ఫిజిక్స్, కెమిస్ట్రీ, మేథ్స్ తప్పనిసరిగా చదివి ఉండాలి. దీనితోపాటు జేఈఈ మెయిన్ 2025 స్కోరు సాధించాలి.

వయస్సు: 2025 జూలై 1 నాటికి పదహారున్నర సంవత్సరాల నుంచి పంతొమ్మిదిన్నర సంవత్సరాల మధ్యలో ఉండాలి.

వేతనం: మిలిటరీ సర్వీస్ పే కింద చదువుకునే కాలంలో స్టైపెండ్ నెలకు 15,500/- రూపాయలు లభిస్తుంది. తర్వాత 56,000/- వేతనంతో పాటు డీఏ, హెచ్ఆర్ఏ ఇతర ప్రోత్సాహకాలు అందుతాయి.

ఎంపిక విధానం: జేఈఈ(మెయిన్) స్కోరు, స్టేజ్-1, స్టేజ్-2 పరీక్షలు, ఇంటర్వ్యూ, మెడికల్ ఎగ్జామినేషన్ తదితరాల ఆధారంగా ఎంపిక ఉంటుంది.

కోర్సు శిక్షణ: కోర్సు కాల వ్యవధి నాలుగు సంవత్సరాలు. ఇందులో బేసిక్ మిలిటరీ ట్రైనింగ్, బీటెక్ టెక్నికల్ శిక్షణ ఇస్తారు. మొదటి మూడేళ్లు పుణె, సికింద్రాబాద్, మావ్‌లోని ఆర్మీ కేంద్రాల్లో ఈ శిక్షణ ఉంటుంది. తరవాత డెహ్రాడూన్‌లోని 'ఇండియన్ మిలిటరీ అకాడమీ'లో శిక్షణ కొనసాగుతుంది. ఆపై డిగ్రీతోపాటు, లెఫ్టినెంట్ హోదాలో సైన్యంలో విధుల్లోకి తీసుకుంటారు.

చివరి తేదీ: 2025 నవంబర్ 13

వెబ్‌సైట్: joinindianarmy.nic.in

డిజైన్ కోర్సుల్లో ప్రవేశానికి
యూసీడ్ - 2026

డిజైన్ కోర్సుల్లో ప్రవేశాలకు ఉద్దేశించిన 'అండర్ గ్రాడ్యుయేట్ కామన్ ఎంట్రెన్స్ ఎగ్జామ్ ఫర్ డిజైన్(యూసీడ్)- 2026 నోటిఫికేషన్ వెలువడింది. దీనిని బాంబే ఐఐటీ నిర్వహిస్తోంది. ఈ నోటిఫికేషన్ ద్వారా ఐఐటీలు సహా దేశ వ్యాప్తంగా ఉన్న ప్రముఖ డిజైన్ ఇన్‌స్టిట్యూట్‌లలోని బీడిజైన్ కోర్సుల్లో అడ్మిషన్స్ నిర్వహిస్తారు. ఇంటర్ పూర్తి చేసిన వారు యూసీడ్ ఎంట్రెన్స్ రాయడానికి అర్హులు. 'యూసీడ్ స్కోరు వాలిడిటీ ఏడాది. వరుసగా రెండు సంవత్సరాలు మాత్రమే అభ్యర్థులు ఈ ఎంట్రెన్స్ రాయవచ్చు.

వయస్సు: దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు 2001 అక్టోబర్ 10 తరువాత జన్మించి ఉండాలి. దివ్యాంగులు, ఇతర రిజర్వేషన్ల అభ్యర్థులకు ప్రభుత్వ నిబంధనల మేరకు వయస్సులో సడలింపు ఉంటుంది.

దరఖాస్తుకు చివరి తేదీ: 2025 అక్టోబర్ 31

పరీక్ష తేదీ: 2026 జనవరి 18 **ఫలితాలు:** 2026 మార్చి 6

పరీక్ష సెంటర్లు: తెలుగు రాష్ట్రాల్లో యూసీడ్ పరీక్ష సెంటర్లు హైదరాబాద్, విశాఖపట్నంలో ఉన్నాయి.

వెబ్‌సైట్: www.uceed.iitb.ac.in/2026/

పారా మెడికల్‌లో
పీజీ, పీజీ డిప్లొమా

ఆంధ్రా యూనివర్సిటీ, బొల్లినేని మెడ్‌స్కిల్స్ కలిసి పీజీ, పీజీ డిప్లొమా(సెల్ఫ్ సపోర్టెడ్) కోర్సుల్లో అడ్మిషన్స్ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు.

మాస్టర్ ఆఫ్ హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్: రెండు సంవత్సరాల కోర్సు ఇది. గ్రాడ్యుయేషన్ పూర్తిచేసినవారు దరఖాస్తు చేసుకోవచ్చు. మొత్తం 40 సీట్లు ఉన్నాయి. కోర్సు ఫీజు 55000 రూపాయలు.

పీజీ డిప్లొమా ఇన్ క్రిటికల్ కేర్ టెక్నాలజీ: కోర్సు కాల వ్యవధి ఒక సంవత్సరం. ఎంబీబీఎస్, బీడీఎస్, బీఎస్సీ, బీఫార్మా, బీఎస్సీ నర్సింగ్, బీఏఎమ్ఎస్, బీహెచ్ఎమ్ఎస్, బీఎస్సీ చదివిన వారు దరఖాస్తు చేసుకోవచ్చు. మొత్తం సీట్లు 15 ఉన్నాయి. కోర్సు ఫీజు 60000 రూపాయలు.

పీజీ డిప్లొమా ఇన్ ఎమర్జెన్సీ మెడిసిన్ టెక్నాలజీ: కోర్సు కాల వ్యవధి ఒక సంవత్సరం. ఎంబీబీఎస్, బీడీఎస్, బీఎస్సీ, బీఫార్మా, బీఎస్సీ నర్సింగ్, బీఏఎమ్ఎస్, బీహెచ్ఎమ్ఎస్, బీఎస్సీ చదివిన వారు దరఖాస్తు చేసుకోవచ్చు. మొత్తం సీట్లు 15 ఉన్నాయి. కోర్సు ఫీజు 60000 రూపాయలు.

పీజీ డిప్లొమా ఇన్ గ్యాస్ట్రోఎంట్రాలజీ టెక్నాలజీ: కోర్సు కాల వ్యవధి ఒక సంవత్సరం. ఎంబీబీఎస్, బీడీఎస్, బీఎస్సీ, బీఫార్మా, బీఎస్సీ నర్సింగ్, బీఏఎమ్ఎస్, బీహెచ్ఎమ్ఎస్, బీఎస్సీ చదివిన వారు దరఖాస్తు చేసుకోవచ్చు. మొత్తం సీట్లు 15 ఉన్నాయి. కోర్సు ఫీజు 40000 రూపాయలు.

వయస్సు: అభ్యర్థుల వయస్సు 20 నుంచి 35 సంవత్సరాల మధ్యలో ఉండాలి.

చివరి తేదీ: 2025 నవంబర్ 7

ఫోన్: 7995013421, 7207953919

వెబ్‌సైట్: www.audoa.andhrauniversity.edu.in



డీఆర్‌డీఈలో అప్రెంటిస్‌షిప్

బెంగళూరులోని డీఆర్‌డీఓ ఎలక్ట్రానిక్స్ అండ్ రాడార్ డెవలప్‌మెంట్ ఎస్టాబ్లిష్‌మెంట్‌లో ఏడాది కాలానికి గ్రాడ్యుయేట్ డిప్లొమా, ఐటీఐ అప్రెంటిస్‌షిప్ ఖాళీల భర్తీకి నోటిఫికేషన్ వెలువడింది.

మొత్తం ఖాళీలు 105

ఖాళీల వివరాలు:

- గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌షిప్(ఇంజనీరింగ్)- 23
- గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌షిప్(జనరల్) - 27
- డిప్లొమా(ఇంజనీరింగ్) అప్రెంటిస్‌షిప్ - 27
- ఐటీఐ అప్రెంటిస్‌షిప్ - 30

విభాగాలు: ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్, బీకాం, బీబీఏ, బీఎస్సీ, సివిల్ ఇంజనీరింగ్, మెకానికల్, ఆటోమొబైల్, కంప్యూటర్ ఆపరేటర్ అండ్ ప్రోగ్రామింగ్ అసిస్టెంట్, ఎలక్ట్రీషియన్, వెల్డర్, పెయింటర్, ఫోటోగ్రాఫర్, ఎలక్ట్రీషియన్ తదితరాలు ఉన్నాయి.

అర్హతలు: పోస్టులను అనుసరించి సంబంధిత విభాగంలో ఐటీఐ/డిప్లొమా/గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి ఉండాలి.

వయస్సు: 18 సంవత్సరాలు పూర్తి కావాలి.

దరఖాస్తు విధానం: ఐటీఐ అభ్యర్థులు ఎన్‌ఏపీఎస్ పోర్టల్‌లో, ఇతరులు ఎన్ఏటీఎస్ పోర్టల్ దరఖాస్తు చేసుకోవాలి.

ఇంటర్వ్యూ హాజరు కావాల్సిన తేదీ: 2025 నవంబర్ 4

చిరునామా: ఎలక్ట్రానిక్స్ అండ్ రాడార్ డెవలప్‌మెంట్ ఎస్టాబ్లిష్‌మెంట్, సీవీ రామన్ నగర్, బెంగళూరు.

వెబ్‌సైట్: drdo.gov.in/

SCHOLARSHIP ALERT

Mahindra Big Boss Nayi Pehchan Scholarship

Description: The Mahindra Big Boss Nayi Pehchan Scholarship 2025-26 is designed to empower children of freelance tractor mechanics by offering a scholarship of INR 6,000 annually to support their educational journey.

Eligibility:
- Children of freelance tractor mechanics.
- Aged 7 to 21 years, enrolled in school, college, or vocational courses.
- 50% marks (or equivalent) in the previous class/semester.
- Open to students across India.
- SC/ST/OBC reservations available.
- Children of Buddy4Study or Mahindra & Mahindra Ltd. employees are not eligible.

Prizes & Rewards: Students will receive a scholarship amount of INR 6000/-.

Last Date to Apply: 15-11-2025

Application mode: Online applications only

L'Oréal For Young Women in Science Program

Description: L'Oréal India offers the L'Oréal For Young Women in Science Program 2025-26 for young women who have passed Class 12 and wish to pursue higher education in scientific fields.

Eligibility: Open to female students only.
- Annual family income should not exceed INR 6,00,000.
- **UG students:** Must have secured at least 85% marks in Class 12 (Science Stream) and be pursuing an undergraduate degree in a science-related field (except final-year students).
- **PG/PhD students:** Must have secured at least 60% marks in their undergraduate course and be pursuing post-graduation (any year) in fields such as Technology, Science, Pharma, Life Sciences, Biotechnology, etc. (except final-year students).
- Students from PAN India are eligible.
- Children of L'Oréal India and Buddy4Study employees are not eligible.

Prizes & Rewards:
- **UG students:** Fixed scholarship of INR 62,500
- **PG and PhD students:** Upto scholarship of INR 1,00,000

Last Date to Apply: 03-11-2025 ***Application mode:*** Online only

Short Url: www.b4s.in/aj/LIS6

Muskaan Scholarship Program 2.0

Description: An initiative by Valvoline Cummins Private Ltd. (VCPL) to offer financial assistance and mentorship support to children of commercial drivers (LMV/HMV), mechanics and children belonging to the Economically Weaker Sections (EWS) category, ensuring continuity in their education.

Eligibility: Students in Classes 9 to 12 from the southern, eastern, and northeastern states of India are eligible to apply for the scholarship. The scholarship is available to children of commercial drivers (LMV/HMV), children of mechanics, and students belonging to the Economically Weaker Sections (EWS) category. To be eligible, applicants must have scored above 60% in their previous class. Additionally, the total family income from all sources should not exceed INR 8 lakh per annum. However, children of employees of Valvoline Cummins Private Ltd. (VCPL) and its implementation partner organisations are not eligible for this scholarship.

Prizes & Rewards: Scholarship of up to INR 12,000 and mentorship support

Last Date: 05-11-2025 ***Application:*** Online only

Short Url: www.b4s.in/aj/MKSP2

buddy4study.com

చిత్రజ్యోతి
★ SINCE 1965 ★

నా పరువుకు భంగం కలుగుతోంది

- సిటీ సైబర్‌క్రైమ్ పోలీసులకు చిరంజీవి ఫిర్యాదు



తన రూపాన్ని పోలిన ఏఐ డీప్‌ఫేక్ చిత్రాలను, వీడియోలను సృష్టించి.. వాటికి అసభ్య, అశ్లీల కంటెంట్‌ను జోడించి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తున్న దుండగులపై కఠిన చర్యలు తీసుకోవాలని హీరో చిరంజీవి శనివారం సిటీ సైబర్‌క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ధనార్జనే ధ్యేయంగా నా రూపాన్ని మార్ఫింగ్ చేస్తూ, అసభ్యకరమైన కంటెంట్‌ను అప్‌లోడ్ చేస్తున్న పలు అక్రమ వెబ్‌సైట్లు, ఆన్‌లైన్ చానల్స్‌ను వెంటనే బ్లాక్ చేయాలని కోరారు. తన దృష్టికి వచ్చిన కొన్ని వెబ్ లింక్స్‌ను ఆయన పోలీసులకు అందజేశారు. 'దశాబ్దాల పాటు కష్టపడి నటుడిగా మంచి గుర్తింపు తెచ్చుకున్నాను. ఇలాంటి చర్యలతో నా పరువుకు భంగం కలుగుతోంది. కోట్లాది మంది అభిమానాన్ని చూరగొన్న నన్ను కించపరిచేలా కొందరు గుర్తు తెలియని వ్యక్తులు నీచపు పనులకు పాల్పడుతున్నారు. వారిని కఠినంగా శిక్షించండి' అని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి)

హీరో నారా రోహిత్, శిరీషల వివాహం ఈ నెల 30న జరగనుంది. ఆదివారం హల్దీ వేడుకతో పెళ్లి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా శిరీషతో దిగిన ఫొటోను నారా రోహిత్ సోషల్ మీడియాలో షేర్ చేశారు.



పోరాటాలే ప్రత్యేకాకర్షణగా



గోపీచంద్ కథానాయకుడిగా సంకల్ప్ రెడ్డి ఓ భారీ యాక్షన్ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. 'గోపీచంద్ 33' అనేది వర్కింగ్ టైటిల్. పవన్ కుమార్ సమర్పణలో శ్రీనివాసా సిల్వర్ స్క్రీన్ బేనర్‌పై శ్రీనివాసా చిట్టూరి ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్నారు. ప్రస్తుతం కథానాయకుడు గోపీచంద్, ఇతర తారాగణం పాల్గొంటుండగా వెంకట్ మాస్టర్ నేతృత్వంలో భారీ యాక్షన్ సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. ఈ యాక్షన్ ఎపిసోడ్ సినిమాకే హైలెట్‌గా నిలవనుందని యూనిట్ తెలిపింది. కాగా, మేకర్స్ విడుదల చేసిన స్పెషల్ పోస్టర్, గ్లింప్స్ వీడియోకు అభిమానుల నుంచి అద్భుతమైన స్పందన లభించింది. ఆ పోస్టర్‌లో యోధుడిలా కనిపించిన గోపీచంద్ తన పాత్రలోని ఇంటెన్స్‌ని ప్రజెంట్ చేశారు. మునుపెన్నడూ చేయని విభిన్నమైన పాత్రలో గోపీచంద్ కనిపించబోతున్నట్లు ప్రచార చిత్రాలను చూస్తే అర్థమవుతోంది. విభిన్నమైన కథలతో, సాంకేతిక నైపుణ్యంతో ప్రత్యేక గుర్తింపు పొందిన సంకల్ప్ రెడ్డి ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తుండటం వల్ల అంచనాలు తారాస్థాయికి చేరాయి. ఈ చిత్రానికి సౌందర్ రాజన్ డీఓపీగా వ్యవహరిస్తుండగా, అనుదీప్ దేవ్ సంగీతం అందిస్తున్నారు.

రజనీ - కమల్ మూవీ పక్కా



రజనీకాంత్, కమల్ హాసన్ కాంబినేషన్‌లో ఓ సినిమా రాబోతున్న విషయం తెలిసిందే. అయితే ఈ సినిమా ఎప్పుడు ప్రారంభం కాబోతోంది? దర్శకుడు ఎవరు? అనే విషయాలు మాత్రం ఇప్పటి వరకూ వెల్లడి కాలేదు. మొదట్లో ఈ ప్రాజెక్టుకు లోకేశ్ కనగరాజ్ దర్శకత్వం వహిస్తారనే వార్తలు వచ్చాయి. ఆ తర్వాత ప్రదీప్ రంగనాథన్ పేరు విన్పించింది. కానీ తాను డైరెక్ట్ చేయడంలేదని ప్రదీప్ తెలిపారు. దీంతో ఈ ప్రాజెక్టు పట్టాలెక్కుతుందా అన్న అనుమానాలు అభిమానుల్లో కలిగాయి. అయితే రజనీకాంత్ కూతురు సౌందర్య మాత్రం కచ్చితంగా ఈ సినిమా తెరకెక్కుతుందని అంటున్నారు. ఇటీవల ఓ అవార్డుల ప్రదానోత్సవంలో పాల్గొన్న ఆమె ఈ సినిమాని రాజ్ కమల్ ఫిలిం ఇంటర్నేషనల్ పతాకంపై నిర్మిస్తారని స్పష్టం చేశారు. రజనీకాంత్, కమల్ హాసన్ ఇద్దరూ కలసి నటిస్తే చూడాలనే ఆశ తనకూ ఉందని చెప్పారు. ప్రస్తుతం ఆ సినిమాకు సంబంధించిన పనులు జరుగుతున్నాయి, వివరాలను నాన్నగారు త్వరలో స్వయంగా వెల్లడిస్తారు అని సౌందర్య తెలిపారు. ఆ మధ్య సైమా అవార్డుల వేడుకలో కూడా కమల్ హాసన్ ఈ విషయంపై స్పందించారు. 'ప్రేక్షకులు మా కాంబినేషన్‌ని ఇష్టపడితే మంచిదే కదా, వారు సంతోషంగా ఉంటే మాకూ ఆనందమే. మేమిద్దరం కలసి నటించాలని ఎన్నో ఏళ్లుగా ప్రయత్నిస్తున్నాం. త్వరలోనే మీ ముందుకు కలసి రానున్నాం' అని అన్నారు. కాగా, వీరిద్దరూ కెరీర్ తొలినాళ్లలో 'అపూర్వ రాగంగళ్', 'మూండ్రు ముడిచ్చు', 'అంతులేని కథ' వంటి హిట్ చిత్రాలతోపాటు సుమారు ఇరవైకి పైగా చిత్రాల్లో కలసి నటించారు. 1979లో వచ్చిన 'అల్లావుద్దీనుమ్ అద్భుత విళక్కుమ్' తర్వాత రజనీ, కమల్ కలసి నటించలేదు.

నెపోలియన్ రిటర్న్స్



కొన్నేళ్ల క్రితం 'నెపోలియన్' చిత్రంలో 'నా నీడ పోయింది సార్..' అంటూ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసి అందర్నీ ఆకర్షించిన ఆనంద్ రవి ఈసారి మరో ఉత్కంఠభరితమైన కథతో వస్తున్నారు. ఆయన కథానాయకుడిగా స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిస్తోన్న కొత్త చిత్రం 'నెపోలియన్ రిటర్న్స్'. ఆచార్య క్రియేషన్స్ పతాకంపై భోగేంద్ర గుప్త నిర్మిస్తున్నారు. దివి కథానాయికగా నటిస్తున్నారు. ఆదివారం నిర్వహించిన వేడుకలో టైటిల్‌ను ఆవిష్కరించి, గ్లింప్స్ విడుదల చేశారు. భోగేంద్ర గుప్తా మాట్లాడుతూ 'ఆనంద్ ఈ కథ కోసం చాలా కష్టపడ్డారు. ఏడాదిన్నరకు పైగా ప్రీ ప్రొడక్షన్ కోసమే పని చేశారు. మంచి కథతో అందరి ముందుకు రాబోతున్నాం' అని చెప్పారు. ఆనంద్ రవి మాట్లాడుతూ 'నేను పేరెంట్స్, ప్రతినిధి, నెపోలియన్, కొరమీను వంటి విభిన్న కథా చిత్రాలను తీశాను. కానీ సరైన సక్సెస్, గుర్తింపు రాలేదు. 'నెపోలియన్ రిటర్న్స్'తో ఆ రెండూ వస్తాయనే నమ్మకం ఇప్పుడు కలుగుతోంది. సినిమా మంచి ఎంటర్‌టైన్‌మెంట్‌తో ఉంటుంది. తొమ్మిది నెలల పిల్లాడు ఆత్మగా మారే పాయింట్‌తో ఇంతవరకూ ఎక్కడా సినిమా రాలేదు' అని పేర్కొన్నారు. 'ఈ సినిమాలో నా క్యారెక్టర్‌కు మంచి పేరు వస్తుంది' అని చిత్ర కథానాయిక దివి అన్నారు.

లార్డ్ మార్కో?



మలయాళ సూపర్ స్టార్ మమ్ముట్టి కొత్త చిత్రం ఖరారైంది. 'మార్కో', 'కట్టలాన్' వంటి బ్లాక్‌బస్టర్ చిత్రాలను నిర్మించిన క్యూబ్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. ఈ విషయాన్ని నిర్మాత షరీఫ్ మహ్మద్ సోషల్ మీడియా వేదికగా ప్రకటించారు. మమ్ముట్టి పాత్ర ఎలా ఉండబోతోందో తెలుపుతూ ఓ ప్రత్యేక పోస్టర్‌ని విడుదల చేశారు. మునుపెన్నడూ పోషించని ఓ విభిన్నమైన పాత్రలో మమ్ముట్టి కనిపించనున్నట్లు షరీఫ్ తెలిపారు. దర్శకుడు, ఇతర తారాగణం వివరాలను త్వరలో వెల్లడించనున్నారు. అయితే ఈ చిత్రం పేరు 'లార్డ్ మార్కో' అయి ఉంటుందని పలు ఊహాగానాలు విన్పిస్తున్నాయి. 'మార్కో' డైరెక్టర్ హనీఫ్ అదేని, క్యూబ్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థతో కలిసి నెల రోజుల క్రితం కేరళ ఫిల్మ్ ఛాంబర్‌లో 'లార్డ్ మార్కో' టైటిల్‌ని రిజిస్ట్రేషన్ చేయించడం ఈ ఊహాగానాలకు ఊతమిస్తోంది. కాగా, మమ్ముట్టి నటించి, నిర్మించిన 'కలమ్ కావల్' సినిమా నవంబరు 27న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సినిమా విడుదల తర్వాతే మమ్ముట్టి కొత్త ప్రాజెక్టు పట్టాలెక్కే అవకాశాలున్నట్లు సమాచారం.

లవ్ అండ్ వార్ ఇటలీలో క్లైమాక్స్‌కు







దర్శకుడు సంజయ్‌లీలా భన్సాలీ గ్రాండియర్‌గా తెరకెక్కిస్తోన్న బాలీవుడ్ చిత్రం 'లవ్ అండ్ వార్'. రణ్‌బీర్‌కపూర్, విక్కీ కౌశల్, అలియాభట్ ప్రధాన తారాగణం. త్వరలో ఇటలీలో ఈ చిత్రం షెడ్యూల్ జరగాల్సి ఉంది. అయితే ఆ షెడ్యూల్‌ను రద్దు చేసి ముంబైలోనే షూటింగ్ జరిపేందుకు మేకర్స్ సిద్ధమైనట్లు బాలీవుడ్ మీడియాలో వార్తలు వచ్చాయి. భారీ సెట్స్ నిర్మించి అందులో ఇటలీకి సంబంధించిన సన్నివేశాలను చిత్రీకరించనున్నారనేది ఆ వార్తల సారాంశం. అయితే ఆ వార్తల్లో నిజం లేదని మేకర్స్ తెలిపారు. అయితే ఆ షెడ్యూల్ రద్దు కాలేదని మేకర్స్ తెలిపారు. కథానుసారం రియల్ లొకేషన్లలోనే చిత్రీకరించనున్నట్లు తెలిపారు. నవంబర్‌లో పది రోజుల షెడ్యూల్‌ను ముంబైలో ప్లాన్ చేస్తున్నారు. అది పూర్తయ్యాక 20 రోజుల పాటు సాగే గ్రాండ్ క్లైమాక్స్ షెడ్యూల్‌ను డిసెంబర్‌లో ఇటలీలో చేయనున్నారు. అక్కడ 45 రోజుల షెడ్యూల్‌ను ప్లాన్ చేసినా చివరకు 20 రోజులకు కుదించినట్లు మేకర్స్ తెలిపారు. వచ్చే ఏడాది ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది.

ఆర్యన్ ప్రణయ గీతం



విష్ణు విశాల్, శ్రద్ధా శ్రీనాథ్ జంటగా ప్రవీణ్ కె తెరకెక్కించిన సస్పెన్స్ థ్రిల్లర్ 'ఆర్యన్'. శుభ్ర, ఆర్యన్ రమేశ్, విష్ణు విశాల్ నిర్మాతలు. 'రాట్ససన్' విజయం తర్వాత విష్ణు విశాల్ మరోసారి 'ఆర్యన్'లో పోలీస్ అధికారి పాత్రను పోషిస్తున్నారు.ఈనెల 31న తెలుగు, తమిళ భాషల్లో విడుదల కానుంది. తెలుగు రాష్ట్రాల్లో ఈ చిత్రాన్ని సుధాకర్ రెడ్డి(శ్రేష్ఠ్ మూవీస్) విడుదల చేస్తున్నారు. ఇటీవలె విడుదల చేసిన ప్రచార చిత్రాలకు మంచి స్పందన లభించింది. తాజాగా చిత్రబృందం 'పరిచయమే..' అంటూ హీరో, హీరోయిన్ మధ్య సాగే ప్రణయ గీతాన్ని విడుదల చేసింది. సామ్రాట్ రాసిన ఈ గీతానికి జిబ్రాన్ అద్భుతమైన స్వరాలు సమకూర్చారు. వరుస హత్యల నేపథ్యంలో ఉత్కంఠభరితంగా సాగే ఈ చిత్రం ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని ఇస్తుందని మేకర్స్ తెలిపారు. కాగా, ఈ చిత్రానికి హరీశ్ కన్నన్ డీఓపీగా వ్యవహరిస్తున్నారు.

గుంటూరు రూరల్ వార్తలు

◆ మంగళగిరి ◆ తాడికొండ ◆ ప్రత్తిపాడు

మిద్దె సెంటరులో మొక్కల పంపిణీ

మంగళగిరి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): పచ్చదనం - పర్యావరణ పరిరక్షణ బృందం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక మిద్దె సెంటరులో మొక్కలు పంపిణీ చేశారు. పనస, నేరేడు, రావి, తీపి చింత తదితర రకాలకు చెందిన సుమారు 300 మొక్కలను, తోటకూర, గోంగూర, బచ్చలకూర, చుక్కకూర విత్తనాలను ప్రజలకు ఉచితంగా అందజేసినట్టు డాక్టర్ ఆకురాతి కోదండరామయ్య తెలిపారు. భూతాపం ఇలాగే పెరిగితే కొన్నేళ్లలో మంచు ఖండాలు కరిగి సముద్ర నీటిమట్టం పెరిగిపోతుందని, దాదాపు 113 నగరాలు నీటమునిగే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ మొక్కలు పెంచడం ద్వారా భూతాపం పెరుగుదలను అరికట్టవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఎం.అప్పలనాయుడు, టీ.అంజనేయులు, ఎ.శేషాచలం, టీ.వెంకటరావు, కేదారేశ్వరరావు పాల్గొన్నారు.

ఏఎస్ఐ బ్రహ్మానాయుడు మృతి

పెదనందిపాడు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): పెదనందిపాడు పోలీసుస్టేషన్లో ఏఎస్ఐగా విధులు నిర్వర్తిస్తున్న ఎం బ్రహ్మానాయుడు(57) ఆదివారం మృతి చెందాడు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మెడికల్ లీవ్‌లో ఉన్నారు. ఆయన స్వగ్రామం పల్నాడు జిల్లా చిలకలూరిపేటలో ఆయన మృతదేహాన్ని ఉంచారు. ఎస్ఐ మధుపవన్, సిబ్బంది వెళ్లి పూలమాలలు వేసి నివాళులర్పించి, ప్రభుత్వ లాంచనాలతో అంత్యక్రియలు నిర్వహించారు.

రాయపూడి పాలవాగు గేటు మరమ్మతులు చేయాలి


మరమ్మతులకు నోచుకోని పాలవాగు గేటు

తుళ్లూరు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి) : రాయపూడి పాలవాగు గేటు మరమ్మతు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు. భారీ వర్షాల నేపథ్యంలో పాలవాగులోకి వరద నీరు భారీగా చేరే అవకాశం ఉందని, ఈ నీరు కృష్ణానదిలో గేటు ఎత్తటం ద్వారా కలుస్తుందని, అయితే ఎప్పటి నుండో గేటు శిథిలావస్థలో ఉండటంతో పైకి ఎత్తటానికి మొరాయించి ఉందన్నారు. అధికారులు స్పందించి గేటు మరమ్మతు చేయాలని కోరుతున్నారు.

టీటీడీకి పది టన్నుల కూరగాయలు



టీటీడీకి కూరగాయల లోడ్‌ను పంపుతున్న కాకతీయ కన్వెన్షన్ సభ్యులు

తాడికొండ, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానం అన్నదాన కార్యక్రమానికి కాకతీయ కన్వెన్షన్ సొసైటీ సభ్యులు పది టన్నుల కూరగాయలను వితరణ చేశారు. ఆదివారం తాడికొండ మండలం మోతడక గ్రామంలోని కాకతీయ కన్వెన్షన్ సొసైటీలో టీటీడీ దేవస్థానం వాహనానికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కూరగాయలను వాహనంలోకి ఎక్కించి ప్రముఖ వైద్యుడు యర్రా నాగేశ్వరరావు జెండా ఊపి లాంచనంగా ప్రారంభించారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు కే.రమేష్‌చంద్ర మిత్రమండలి, వృద్ధులు పాల్గొన్నారు.

వ్యవస్థలన్నీ నిర్వీర్యం

తాడేపల్లి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వ్యవస్థలన్నీ నిర్వీర్యమయ్యాయని ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఎంటీఎంసీ వైసీపీ కన్వీనర్ దొంతిరెడ్డి వేమారెడ్డి, తాడేపల్లి పట్టణ అధ్యక్షుడు బుర్రముక్క వేణుగోపాలసోమిరెడ్డి విమర్శించారు. ఆదివారం పట్టణంలోని మహానాడు 23వ రోడ్డు అధ్యక్షుడు ఆర్ భాస్కరరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కోటి సంతకాల కార్యక్రమంలో నేతలు మాట్లాడారు. కార్యక్రమంలో వైసీపీ నేతలు దొంతిరెడ్డి వేమారెడ్డి, బుర్రముక్క వేణుగోపాల సోమిరెడ్డి, దొంతిరెడ్డి రామకృష్ణారెడ్డి, పండు, సయ్యద్ సలాం, మల్లిఖార్జునరెడ్డి, డి శరణ్‌కుమార్‌రెడ్డి, కళ్యాణ్, బాలకోటయ్య, భూపతి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

గుంతలకు తాత్కాలిక మరమ్మతులు


పాతబస్టాండ్ సెంటర్లో రహదారిపై గుంతలకు మరమ్మతులు చేయిస్తున్న అధికారులు

పెదనందిపాడు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి) : గుంటూరు-పర్చూరు రహదారిలో స్థానిక పాతబస్టాండ్ సెంటర్లో ఏర్పడ్డ భారీ గుంతల వల్ల నిత్యం ప్రమాదాలు జరుగుతుండడంతో పీజీఆర్ఎస్‌లో 10వ వార్డు సభ్యుడు వెలినేని శివయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు అధికారులు స్పందించారు. దీనిలో భాగంగా ఆదివారం ఆర్అండ్‌బీ అధికారులు ప్రొక్లెయిన్ ద్వారా రహదారిని చదును చేసి, డస్ట్ పోసి తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. ఈ మరమ్మతులతో ఏ మాత్రం ప్రయోజనం లేదని పలుమార్లు ఇదేరీతిలో మరమ్మతులు చేశారని, శాశ్వత పరిష్కారం చూపడం లేదని ప్రజలు బహిరంగంగా విమర్శలు చేస్తున్నారు. గ్రామంలో అనేకచోట్ల ప్రధాన రహదారిలో భారీ గుంతలు పడి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వాటిని ఎప్పుడు పూడ్చుతారోనని ప్రజలు నిరీక్షిస్తున్నారు. ఫిర్యాదులు అందితేనే మరమ్మతులు చేపడతారా అంటూ అధికారులపై గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కొండవీటి వాగు అభివృద్ధికి ప్రణాళికలు

● పరిశీలించిన ఇరిగేషన్ అధికారులు
● ఎమ్మెల్యే చొరవతో కదిలిన యంత్రాంగం


లాం చప్టా వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న కొండవీటి వాగు (ఫైల్‌ఫొటో)


గండ్లను పరిశీలిస్తున్న ఇరిగేషన్ అధికారులు (ఫైల్‌ఫొటో)

తాడికొండ, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): కొండవీటి వాగు అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధమౌతున్నాయి. కొండవీటి వాగు వరదలో నియోజకవర్గంలోని వేలాది ఏకరాల పంట పొలాలు నీట మునిగిపోవటంతో రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు. ఈ సంవత్సరం దామరపల్లి, గరికపాడు, లాం, తాడికొండ, కంతేరు గ్రామాల మీదుగా వెళ్తున్న కొండవీటి వాగులో 10 గండ్లు పడటం వల్ల వేలాది ఎకరాలు నీట మునిగాయి. అంతేకా కుండా లాం చప్టా వద్ద వరద నీరు ఉధృతంగా ప్రవహించటంతో గుంటూరు నుంచి అమరావతి, పెదకూరపాడు, క్రోసూరు, రాజధాని అమరావతి వెళ్లటానికి రాకపోకలు పూర్తిగా నిలిచిపోతున్నాయి. కొంత మంది ప్రయాణికులు చప్టా దాటే క్రమంలో వాగులో కొట్టుకొనిపోయి చనిపోయిన సందర్భాలు కూడా ఉన్నాయి. 2004 నుంచి లాం చప్టాపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని ప్రతిపాదనలు పంపించినా ప్రయోజనం లేదు. 2014-19లో అప్పటి టీడీపీ ప్రభుత్వం ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ లాం చప్టాపై బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేయించి శంకుస్థాపన చేశారు. తరువాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం బ్రిడ్జి నిర్మాణాన్ని గాలికి వదిలేసింది. ఇప్పుడు కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్ తిరిగి కొండవీటి అభివృద్ధికి పూనుకున్నారు. ఈ సంవత్సరం కొండవీటి వాగు వరద ఉధృతికి 10 చోట్ల గండ్లు పడి వేలాది ఎకరాలు నీట మునిగిపోయాయి. దీంతో స్థానిక టీడీపీ నాయకుల సహకారంతో రైతులు ఎమ్మెల్యే దృష్టికి సమస్యను తీసుకువెళ్లారు. స్పందించిన వెంటనే కలెక్టర్‌కు, కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌కు సమస్యను వివరించారు. స్పందించిన కలెక్టర్ ఇరిగేషన్ అధికారులతో మాట్లాడి కొండవీటి వాగు అభివృద్ధికి నివేదికలు ఇవ్వాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో కొండవీటివాగు వరద వల్ల పడిన గండ్లను ఇరిగేషన్ ఎస్ఈ, డీఈ, ఏఈలు పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్‌ను కలిసి పరిస్థితి వివరించారు. లాం చప్టా దగ్గర నుంచి నీరుకొండ వరకు సుమారు 14కిలో మీటర్లు ఉంటుందని, ఎగువకు 17కిలో మీటర్లు ఉంటుందని తెలిపారు. కొండవీటివాగు ఫిరంగిపురం, మేడికొండూరు, తాడికొండ మండలాల మీదుగా రాజధాని నీరుకొండకు చేరుతుందని తెలిపారు. వాగు కట్టలను బలోపేతం చేయటంతో పాటు, కొండవీటి వాగు కాలువలను వెడల్పు చేయటంతో పాటు కట్టలను బలోపేతం చేస్తే పంట నష్టానికి అడ్డుకట్ట వేయవచ్చునని తెలిపారు. దీనికి కావాల్సిన ప్రణాళికను సిద్ధం చేయాలని ఇరిగేషన్ అధికారులకు సూచించారు. సీఎం దృష్టికి సమస్యను తీసుకువెళ్లి వెంటనే పరిష్కరిస్తామని పేర్కొన్నారు.

పేద విద్యార్థులకు ఉపకార వేతనాల పంపిణీ


విద్యార్థులకు నోటుపుస్తకాలు, ఉపకార వేతనాలు పంపిణీ చేస్తున్న హనుమంతరావు, సొసైటీ ప్రతినిధులు

మంగళగిరి సిటీ, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మార్కండేయ ఎడ్యుకేషనల్ సొసైటీ 42వ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం మంగళగిరి తెనాలి రోడ్డు లోని మార్కండేయ పద్మశాలీయ కల్యాణ మండపంలో చేనేత వర్గాలకు చెందిన పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు, నోటుపుస్తకాలు, కాలిక్యులేటర్లు పంపిణీ చేశారు. ఇంటర్మీడియేట్, ఐటీఐ, పాలిటెక్నిక్, డిగ్రీ, బీటెక్, బీఫార్మసీ, ఎంబీబీఎస్, ఎంసీఏ, ఎంబీఏ, ఎమ్మెస్సీ కోర్సులు చదువుతున్న సుమారు 620 మంది విద్యార్థులకు రూ.22 లక్షల విలువ చేసే ఉపకార వేతనాలను అందజేశారు. సొసైటీ ద్వారా అందిస్తున్న సహకారాన్ని విద్యార్థులు సద్వినియోగించుకుని చదువులో రాణించి భవిష్యత్తులో ఉన్నత స్థానాలను అందుకోవాలని అతిథులు సూచించారు. ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఏపీ రెరా హోల్‌టైం మెంబర్ మేరువ వెంకటేశ్వర్లు, టీటీడీ చీఫ్ ఆడిటర్ అందె వెంకటేశ్వరరావు, జైళ్ల శాఖ డీఎస్పీ చుక్కల సూర్యకుమార్, ఏపీఎంఎస్ఐడీసీ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు, మునిసిపల్ మాజీ చైర్మన్ గంజి చిరంజీవి, మార్కండేయ ఎడ్యుకేషనల్ సొసైటీ గౌరవాధ్యక్షుడు జొన్నాదుల బాబూశివప్రసాద్, కార్యదర్శి ప్రెగడ రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

పోలీసు అమరవీరుల త్యాగాలకు గౌరవ వందనం


అమరవీర జవాన్ గౌరీశంకర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సీఐ రమానాయక్, పోలీసు సిబ్బంది

వట్టిచెరుకూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా వట్టిచెరుకూరు మండలపరిధిలోని కాట్రపాడు గ్రామానికి చెందిన వీర జవాన్ స్వర్గీయ కాండ్రు గౌరిశంకర్ వీరోచిత మరణం చిరస్మరణీయమని వట్టిచెరుకూరు సీఐ రమానాయక్ అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాలతో వట్టిచెరుకూరు సీఐ రమానాయక్, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది ఆదివారం మండలంలోని కాట్రపాడు గ్రామంలో పోలీసు విధి నిర్వాహణలో వీరమరణం పొందిన అమరుడు కాండ్రు గౌరీ శంకర్ విగ్రహానికి సీఐ రమానాయక్, పోలీసు అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పిస్తూ గ్రామస్థులతో కలసి మౌనం పాటించారు. గ్రేహౌండ్ దళంలో విధి నిర్వాహణలో భాగంగా కాండ్రు గౌరి శంకర్ 2007 ఏప్రిల్ 8వ తేదీన నక్సల్స్‌తో పోరాడుతూ నేలకొరిగిన గౌరీ శంకర్ పోరాట పటిమ మరువ లేనిదని రమానాయక్ అన్నారు. అనంతరం గ్రామంలోని అమర వీరుడు గౌరి శంకర్ గృహానికి వెళ్లి తల్లిదండ్రులైన కాండ్రు సుబ్బారావు, రత్నకుమారిలను ఆత్మీయంగా పలుకరిస్తూ వారి యోగ క్షేమాలు తెలుసుకొని వారిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పీఎస్ఐ బాబూరావు, సాయి కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

మెగావైద్యశిబిరంలో 1710 మందికి వైద్యపరీక్షలు


వైద్యశిబిరం ప్రారంభోత్సవంలో పాల్గొన్న షేక్ జబీన్, శ్రీఅనిత, డాక్టర్ రమేష్‌బాబు, వంగర సురేష్

దుగ్గిరాల, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలో 12ఏళ్లుగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న ప్రముఖ ఫార్మాసంస్థ బయోఫర్ సీఈవో డాక్టర్ రంగిశెట్టి జగదీష్ బాబు సేవలు అభినందనీయమని ఎంపీపీ షేక్ జబీన్ అన్నారు. చిలువూరులోని కొండపనేని రంగారావు స్కూల్లో రంగిశెట్టి ఫౌండేషన్ సౌజన్యంతో మానవ సేవాసంస్థ సంయుక్త ఆదివారం ఆధ్వర్యంలో జరిగిన వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. ఎంపీపీ షేక్ జబీన్, డాక్టర్ రంగిశెట్టి రమేష్‌బాబు, టీడీపీ మండల అధ్యక్షురాలు కేసంనేని శ్రీఅనిత, కాట్రగడ్డ నారాయణరావులు శిబిరాన్ని ప్రారంభించారు. క్యాన్సర్ స్క్రీనింగ్, ఎకో, ఈసీజీ వంటి గుండె సంబంధిత పరీక్షలు వంటి ఖరీదైన పరీక్షలు ప్రజలకు ఉచితంగా చేయడంపై ఎంపీపీ జబీన్, శ్రీఅనితలు అభినందనలు తెలిపారు. దంత వైద్యపరీక్షలు, నేత్రపరీక్షలు జరిపారు. నేత్ర పరీక్షలు జరిపించుకున్న వారిలో క్యాటరాక్ట్ శస్త్రచికిత్స అవసరమైన 12 మందికి ఉచితంగా జరిపిస్తామని వంగర సురేష్‌బాబు, డాక్టర్ రంగిశెట్టి సురేష్ బాబులు తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2గంటలకు వరకు జరిగిన శిబిరంలో 1710కి ఉచితంగా వైద్యపరీక్షలు జరిపినట్లు నిర్వాహకులు సురేష్ తెలిపారు. తిరుమలశెట్టి కొండలరావు, నరసింహారావు, తోటకూర సీతారామయ్య, నిజాముద్దీన్, సాదిక్, గద్దె శ్రీనివాస్, మౌళయ్య, కుర్రా సీతారామయ్య, 17మంది వైద్యులు పాల్గొన్నారు.

ఆహ్లాదంగా ఆర్యవైశ్యుల వనసమారాధన


వనసమారాధనలో పాల్గొన్న రచ్చబండ ఫ్రెండ్స్ సర్కిల్ ప్రతినిధులు

మంగళగిరి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): పెదవడ్లపూడి వైగార్డెన్స్‌లో ఆదివారం మంగళగిరి రచ్చబండ ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో ఆర్యవైశ్యుల వన సమారాధన ఆహ్లాదకర వాతావరణంగా జరిగింది. సుమారు వందమంది దంపతులు సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలను ఆచరించారు. అనంతరం అన్నసమారాధన జరిగింది. ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ ఏపీ అధ్యక్షుడు దేవతి భగవన్నారాయణ మాట్లాడుతూ ఆర్యవైశ్యులు ఐక్యంగా వుండి సామాజిక, రాజకీయ రంగాల్లో అభివృద్ధి చెందాలని, సేవా కార్యక్రమాల్లో ముందుండి మిగతా వారికి ఆదర్శంగా నిలవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రచ్చబండ ఫ్రెండ్స్ సర్కిల్ ప్రతినిధులు చీదెళ్ల వాసు, నేరెళ్ల మురళీ, బోజనపల్లి తాండవ, పసుమర్తి మురళీ, కొలిశెట్టి రాము, మాజేటి సూర్యవేణుగోపాలకృష్ణ, రామ్‌ప్రసాద్, త్రిపురమల్లు సతీశ్, గాదంశెట్టి రామ కృష్ణ, వనమా కిరణ్, పువ్వాడ సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

దేశంలో తారస్థాయికి అవినీతి, కుంభకోణాలు

మంగళగిరి సిటీ, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్ర మోదీ పరి పాలనలో దేశ ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నమైందని, అవినీతి, కుంభకోణాలు తారస్థాయికి చేరాయని సీపీఐ జిల్లా కార్యదర్శి కోటా మాల్యాద్రి విమర్శించారు. మంగళగిరి సీపీఐ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. మోదీ దేశ ప్రజల సొమ్మును తన మిత్రుడైన అదానీకి అప్పగించడం దారుణమన్నారు. ప్రజలు అనేక ఏళ్లుగా పొదుపు చేసుకున్న రూ.32 వేల కోట్ల ఎల్ఐసీ నిధులను దుర్వినియోగం చేయడం అత్యంత దుర్మార్గమని, కేంద్రం పూర్తిగా కార్పొరేట్ ప్రయోజనాల కోసం పనిచేస్తుందని ధ్వజమెత్తారు. ఈ సమావేశంలో ప్రభాకర్‌రావు, చిన్ని సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

5న గండభేరుండ జ్వాలా దీపోత్సవం


ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న సనాతన ధర్మ రక్షా సేన ప్రతినిధులు

మంగళగిరి సిటీ, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మంగళాద్రి పర్వత శిఖరాన కొలువైన శ్రీ గండాలయ స్వామి సన్నిధిలో నవంబరు 5వ తేదీన సనాతన ధర్మ రక్షా సేన ఆధ్వర్యంలో తృతీయ గండభేరుండ జ్వాలా దీపోత్సవం జరుగుతుందని మంగళగిరి విశ్వహిందూ పరిషత్ అధ్యక్షుడు ఆకురాతి నాగేంద్రం తెలిపారు. జ్వాలా దీపోత్సవానికి సంబంధించిన ఆహ్వాన పత్రికలను ఆదివారం సాయంత్రం స్థానిక శ్రీ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ఆవరణలో ఆవిష్కరించారు. నాగేంద్రం మాట్లాడుతూ జ్వాలా దీపాన్ని 700 మీటర్ల చేనేత వస్త్రం, 250 కిలోల ఆవు నెయ్యితో వెలిగించడం జరుగుతుందన్నారు. రాష్ట్ర ఐటీ, విద్యా శాఖల మంత్రి నారా లోకేశ్ జ్వాలా దీపోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరవుతారని, భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కందుల సూర్యప్రకాష్ స్వామి, మాజేటి వేణు గోపాలకృష్ణ, తెంపల్లి దుర్గారావు, మునగాల శ్రీనివాసరావు, మండ్రు సత్యనారాయణ, కాటాబత్తుల విజయ్‌కుమార్, శ్యామ్‌కుమార్, తాతా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సాయివిజయ్‌కు అనంత ఆచార్య అవార్డు


సాక్ డైరెక్టర్ సాయివిజయ్

తాడేపల్లి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): కేఎల్ యూనివర్సిటీ విద్యార్థి కార్యకలాపాల కేంద్రం (సాక్) డైరెక్టర్ సాయివిజయ్ భారత్ ఎడ్యుకేషన్ ఎక్సలెన్స్ అవార్డు (బీఈఈఏ) 2025 వేడుకల్లో అనంత ఆచార్య అవార్డు అందుకున్నారు. హైదరాబాద్‌లోని టి.హబ్‌లో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన చేసిన విద్యారంగం పరిశోధనలో విశిష్ట కృషికి గుర్తింపుగా ఈ అవార్డు ప్రదానం చేశారు. విజయ్ ఆధ్వర్యంలో సాక్ ద్వారా అమలవుతున్న సామాజిక ఇంటర్న్‌షిప్‌లు, గ్రామాభివృద్ధి కార్యక్రమాలు ఎస్‌డిజియస్ లక్ష్యాలకు అనుగుణంగా రూపుదిద్దుకున్న అవుట్ రీచ్ ప్రోగ్రామ్‌లు వేలాది మంది విద్యార్థులకు ప్రేరణగా నిలిచాయి. అవార్డు బ్రెయిన్ ఓ విజన్ సంస్థ ఆధ్వర్యంలో భారతదేశ వ్యాప్తంగా విద్యా పరిశోధన, ఆవిష్కరణ రంగాల్లో సేవలు అందిస్తున్న ప్రముఖులకు ప్రతి ఏటా ఈ అవార్డు ప్రదానం చేయబడుతుంది. కేఎల్‌యూ తరఫున సాయివిజయ్ ఈ అవార్డుకు ఎంపికవడం పట్ల మేనేజ్‌మెంట్, వీసీ సారధివర్మ, ప్రోవీసీలు డాక్టర్ రాజశేఖరరావు, ప్రసాద్, వెంకటరామ్, రిజిస్ట్రార్ సుబ్బారావు తదితరులు అభినందించారు.

ప్రతిభా పురస్కారం అందుకున్న అజయ్


అజయ్ కుమార్‌కు ప్రతిభా పురస్కారం అందజేస్తున్న కేఎస్ లక్ష్మణరావు

మేడికొండూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): విద్యారంగంలో విశేష కృషితో పాటు అందించిన సేవలకు గాను పేరేచర్లలోని ఆపిల్ విద్యాసంస్థల వ్యవస్థాపక చైర్మన్ మోరపాకుల అజయ్‌కుమార్‌కు డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జాతీయ ప్రతిభా పురస్కారం లభించింది. ఈ సందర్భంగా ప్రైవేట్ లెక్చరర్ టీచర్స్ ఆర్గనైజేషన్ సంస్థ ఆదివారం గుంటూరు రెవెన్యూ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అజయ్‌కుమార్‌ను సన్మానించారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు పాల్గొని ఆయన అజయ్‌కుమార్ ప్రతిభా పురస్కార పత్రాన్ని అందజేశారు.

నడకతో సంపూర్ణ ఆరోగ్యం

తుళ్లూరు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి) : నడకతో సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చునని తుళ్లూరు సీఐ కొంకా శ్రీనివాసరావు అన్నారు. ఆస్టర్ రమేష్ హాస్పటల్ వారి ఆధ్వర్యంలో మార్గదర్శి ఇంగ్లిషు మీడియం, జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ఏకథాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. సీఐ జెండా ఊపి ప్రారంభించారు. రమేష్ హాస్పిటల్స్ వారు ఇటువంటి కార్యక్రమం నిర్వహించటం అభినందనీయమని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. గుండెపోటు వచ్చినపుడు చేయాల్సిన సీపీఆర్ విధానాన్ని విద్యార్థులకు వైద్యులు వివరించారు. అనంతరం వైద్యశిబిరం ఏర్పాటు చేసి షుగర్, బీపీ, ఈసీజీ టెస్టులు నిర్వహించి మందులు అంజేశారు. ఈ కార్యక్రమంలో జూనియర్ కళాశాల కరస్పాండెంట్ జొన్నలగడ్డ శంకరు. మార్గదర్శి పాఠశాల ప్రిన్సిపాల్ రమణ, ఉపాధ్యాయులు, రమేష్ హాస్పిటల్ వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



తుళ్లూరులో ఏక్‌థాన్ నిర్వహిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

తుఫాన్‌తో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

● కమిషనర్ అలీం బాషా

మంగళగిరి, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మొంథా తుపాను ముప్పు పొంచి ఉన్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంటీఎంసీ కమిషనర్ అలీం బాషా సూచించారు. జిల్లాలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, రాబోయే నాలుగు రోజుల్లో అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని ఇప్పటికే ఆదేశించామని చెప్పారు. లోతట్టు ప్రాంతాలను ముందుగానే గుర్తించి అవసరమైతే ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించే ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. మంగళగిరి కొత్తపేట, ఇందిరానగర్, తాడేపల్లి సీతానగరం, ఉండవల్లి ప్రాంతాల్లో కొండ చరియలు విరిగిపడే అవకాశం ఉన్నందున ఆయా ప్రాంతాల ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సూచించారు. నగరపాలక సంస్థలో అన్ని విభాగాల అధికారులు, సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది తుఫాను ముప్పు తగ్గేవరకు క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడే అవకాశం వున్న దృష్ట్యా తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలకు ఏవైనా సమస్యలు ఉత్పన్నమైతే ప్రత్యేక కాల్ సెంటర్ 7093912653, 08645-295193 నెంబర్లకు ఫోను చేసి సమాచారం అందిస్తే చర్యలు చేపడతామని తెలిపారు.

గ్రామాలకు ప్రత్యేకాధికారుల నియామకం

ప్రత్తిపాడు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాను ప్రభావంపై అధికారులు అప్రమత్తమయ్యారు. ప్రభుత్వ ఆదేశానుశారం మండలంలో ప్రతి గ్రామనికి ప్రత్యేకాధికారిని నియమించారు. తుఫాను ప్రభావం వల్ల ఏర్పడే పరిస్థితులను ఎదుర్కొని సమర్థవంతంగా ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తీసుకెళ్లడంతో పాటు వారికి ఆహార సదుపాయాలు ఏర్పాటు చేయడం వంటి వాటిపై అధికారులు సమీక్ష నిర్వహించి మండల స్థాయి అధికారులకు సూచనలు చేశారు. ఈదులపాలెం, యనమదల గ్రామాలకు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వినీల్ కుమార్, గనికపూడికి హౌసింగ్ ఏఈ ఆంజనేయులు, గొట్టిపాడుకు డిప్యూటీ ఎంపీడీవో ఆదం షఫి, కొండేపాడుకు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వీ మాధవి, కోయవారిపాలెంకు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్ భారతి, కొత్తమల్లాయపాలెం, పాతమల్లాయపాలెం గ్రామాలకు ఏవో సుగుణా బేగం, నడింపాలెంకు ఏపీఎం లాజరు, ప్రత్తిపాడుకు తహసీల్దార్ సుజాత, తుమ్మలపాలెంకు ఎంఈవో 2 లీలారాణి, తిక్కిరెడ్డిపాలెంకు ఎంపీడీవో శివపార్వతి, నిమ్మగడ్డవారిపాలెంకు ఎంఈవో 1 రమాదేవి, వంగిపురం, మేడవారిపాలెం, తిమ్మాపురం గ్రామాలకు పీఆర్ ఏఈ రాంబాబులను ప్రత్యేకాధికారులుగా నియమించారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి : తహసీల్దార్


వీఆర్వోలకు సూచనలిస్తున్న తహసీల్దార్ వెంకటస్వామి

కాకుమాను, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ వెంకటస్వామి సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆదివారం వీఆర్వోలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ అవసరమైన ప్రాంతాల్లో ముందస్తు పునరావాస కేంద్రాలు ఏర్పాటుకు సిద్ధంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ ప్రియదర్శిని, వీఆర్వోలు సింగారావు, సత్యానందం, బోడెమ్మ, యోహోషువా పాల్గొన్నారు.

● స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం మండల ప్రత్యేక అధికారి, డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ అడల్ట్ ఎడ్యుకేషన్ ఆంజనేయులు ఆధ్వర్యంలో తుఫానుపై సమీక్ష జరుగుతుందని తహసీల్దార్ చెప్పారు. మండలస్థాయి అధికారులు తప్పనిసరిగా ఈ సమీక్షకు హాజరవ్వాలని సూచించారు.

విద్యుత్ ప్రమాదాలు జరగకుండా ప్రజలు సహకరించాలి

● అమరావతి రాజధాని విద్యుత్ ఈఈ వెంటేశ్వరరావు

తుళ్లూరు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ దృష్ట్యా ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలవి విద్యుత్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అమరావతి రాజధాని డివిజన్ సీహెచ్ వెంకటేశ్వరరావు తెలిపారు. రాయపూడి కార్యాలయంలో విలేకరలతో అయన ఆదివారం మట్లాడారు. విద్యుత్ స్తంభాలకు ట్రాన్స్‌ఫార్మర్‌లకు దూరంగా ఉండాలని కోరారు. కరెంటు లైన్‌లపై చెట్టుకొమ్మలు పడితే వెంటనే తెలియజేయాలని ఆయన కోరారు. కరెంటు సంబంధించిన ఏ సంఘటన జరిగినా కంట్రోల్ రూమ్ నెంబరు 1912కు సమాచారం అందించాలని కోరారు.

తుఫాన్ ప్రభావాన్ని ప్రజలకు తెలియజేయాలి


మండలస్థాయి అధికారుల సమీక్షలో మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి నరసింహారెడ్డి

దుగ్గిరాల, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ముంచుకొస్తున్న మొంథా తుఫాన్ నుంచి ప్రజలను అప్రమత్తం చేస్తూ, కాపాడాల్సిన బాధ్యత అధికారులందరి పైనా ఉందని మండల ప్రత్యేక అధికారి, మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ టీ.నరసింహారెడ్డి అన్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మండలపరిషత్, తహసీల్దార్ కార్యాలయాల్లో కంట్రోల్‌రూమ్ ఏర్పాటు చేస్తున్నామని, 24గంటలూ పర్యవేక్షణ ఉంటుందన్నారు. మండలస్థాయి, గ్రామస్థాయి అధికారులందరూ మూడ్రోజులు పూర్తిగా ప్రజలకు అందుబాటులో ఉంటారన్నారు. తహసీల్దార్ ఐ.సునీత, ఎంపీడీవో ఏ.శ్రీనివాసరావు, డిప్యూటీ ఎంపీడీవో జవహర్‌లాల్, ఎంఈవో లక్ష్మీనారాయణ, ఏపీఎం సురేష్‌కుమార్, పీఎస్సై హరికృష్ణ, ఈవో కె.వివేకానంద, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మొంథా తుఫాన్‌తో అప్రమత్తంగా ఉండాలి

తాడికొండ, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్‌తో మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ మెహర్‌కుమార్ తెలిపారు. ఆదివారం తాడికొండ మండలపరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొంథా తుఫాన్ వల్ల భారీ వర్షాలు కురుస్తాయని, లోతట్టు ప్రాంతాల్లో నివసించే ప్రజలు జాగ్రత్తగా ఉండాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు ఏప గ్రామాల్లో లోతట్టు ప్రాంతాలను గుర్తించి ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో కే.సమతావాణి, ఆర్ఐ నూతలపాటి హనుమంతరావు, పంచాయతీ కార్యదర్శి జానీ, వీఆర్వోలు పాల్గొన్నారు.

మాతృమూర్తి రుణం ఎప్పటికీ తీర్చుకోలేనిది

● హైమావతి సంస్మరణ సభలో ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్


హైమావతికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్, కూటమి నాయకులు

తుళ్లూరు, అక్టోబరు 26(ఆంధ్రజోతి): నవమాసాలు మోసి కని, పెంచి, సంతానాన్ని పెద్దవారిని చేసి వారు ఉన్నత స్థితికి చేరే వరకు తపనపడే మాతృమూర్తి రుణం ఎప్పటికీ తీర్చుకోలేనిదని ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ అన్నారు. ఈ నెల 14వ తేదీన రాజధాని అమరావతి ఐక్యకార్యాచరణ సమితి కన్వీనర్ పువ్వాడ సుధాకరరావు మాతృమూర్తి హైమావతి మృతి చెందారు. ఆదివారం తుళ్లూరులోని స్వగృహంలో సంస్మరణ సభ జరిగింది. సుధాకరరావు ఉన్నత స్థితికి ఆయన మాతృమూర్తి శ్రమ ఎంతో ఉందని శ్రావణ్‌కుమార్ అన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు జేఏసీ నేతలు పాల్గొన్నారు.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

తుఫాన్ సేవలకు మున్సిపల్ సిబ్బంది సిద్ధంగా ఉండాలి

తెనాలి అర్బన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో తుఫాన్ సేవలకు మున్సిపల్ సిబ్బంది సంసిద్ధంగా ఉండాలని కమిషనర్ అప్పలనాయుడు కోరారు. మొంథా తుపాన్ హెచ్చరికల నేపథ్యంలో పట్టణంలో ఆదివారం పలు ప్రాంతాలను పరిశీలించారు. మురుగు కాల్వల్లో పేరుకుపోయిన వ్యర్థాలను జేసీబీతో తీయించారు. జేఎంజే కళాశాల, ఉడా కాలనీ, చినరావూరు డొంక, చంద్రబాబు కాలనీ పర్యటించి మున్సిపల్ సిబ్బందికి సూచనలు చేశారు. మూడు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున పల్లపు ప్రాంతాల్లో ఎలాంటి నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలన్నారు. పారిశుధ్య సమస్య తలెత్తకుండా చూడాలని హెల్త్ ఆఫీసర్‌కు సూచించారు. కార్యక్రమంలో ఎంఈ శ్రీకాంత్, హెల్త్ ఆఫీసర్ మొవ్వా యేసుబాబు పాల్గొన్నారు.

ఫ్లెక్సీ హోర్డింగ్‌ల తొలగింపు

తుపాన్ హెచ్చరికల నేపథ్యంలో పట్టణంలో ఫ్లెక్సీ హోర్డింగ్‌లను తొలగించారు. పలు ప్రాంతాల్లో ఏర్పాటుచేసిన ఫ్లెక్సీల ఫ్రేమ్‌లు తుపాన్ గాలులకు పడిపోయే అవకాశాలు దృష్టిలో ఉంచుకుని ముందు జాగ్రత్త చర్యగా మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టారు. పట్టణంలో గాలులకు ఇబ్బందులు తలెత్తే అంశాలను తమ దృష్టికి తీసుకు రావాలని మున్సిపల్ అధికారులు సూచించారు.

ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల కార్తీక వనసమారాధన

తెనాలి అర్బన్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): రూరల్ మండలం అంగలకుదురులో ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల కార్తీక వనసమారాధన ఆదివారం నిర్వహించారు. అసోసియేషన్ నాల్గో వార్షికోత్సవం సందర్భంగా 75ఏళ్లు దాటిన సీనియర్ ఉద్యోగులు శాస్త్రి, సుబ్రహ్మణ్యం, బ్రహ్మానందం, జాన్‌లను సన్మానించారు. గణేష్ యూత్ కన్వీనర్ వీరవల్లి మురళి మాట్లాడుతూ, విశ్రాంత జీవితం గడుపుతున్న ఉద్యోగులకు ఆటవిడుపుగా వనసమారాధన ఉంటుందన్నారు. ఉపసర్పంచ్ కనగాల నాగభూషణం, రజనీబాబు, నాగమల్లేశ్వరరావు, ఆదినారాయణ పాల్గొన్నారు.

ప్రింటర్స్ అసోసియేషన్..

ఏపీ మాస్టర్స్ ప్రింటర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం వైకుంఠపురంలో కార్తీక వన సమారాధన నిర్వహించారు. కుటుంబ సభ్యులకు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి బహుమతులు అందజేశారు. రాష్ట్ర అధ్యక్షుడు బసవయ్య ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఉభయ గుంటూరు జిల్లాలోని పలు ప్రాంతల ప్రింటర్లు పాల్గొన్నారు. కార్యదర్శి శివశంకర్, ఉమామహేశ్వరరావు, అమర్‌నాథ్ తదితరులు పర్యవేక్షించారు.

సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ సమావేశం

తెనాలి అర్బన్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): స్థానిక కవిరాజాపార్కులో ఆదివారం సీనియర్ సిటిజన్స్ సమావేశం నిర్వహించారు. మొవ్వా సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సాహిత్యవేత్తలు అయినాల మల్లేశ్వరరావు, వెంపటి సత్యనారాయణలను సత్కరించారు. కార్యక్రమంలో పూర్ణచంద్రరావు, కోటిరెడ్డి, బి.వెంకటేశ్వరరావు, ఆదినారాయణ, రామమూర్తి, చలమయ్యపాల్గొన్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

● మండల ప్రత్యేక అధికారి జయలక్ష్మి

చేబ్రోలు, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): తుఫాన్ నేపథ్యంలో మండలంలోని గ్రామ స్థాయి అధికారులతో మండల స్పెషల్ ఆఫీసర్ ఎ.జయలక్ష్మి ఎంపీడీవో కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తుఫాను ప్రభావ గ్రామాల్లో విద్యుత్, నీటి సరఫరా, రహదారుల పునరుద్ధరణ వంటి అంశాలపై అధికారులు ముందస్తుగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. అత్యవసర సేవలు 24 గంటలూ అందుబాటులో ఉండాలని ఆదేశించారు. సమావేశంలో తహసీల్దార్ శ్రీనివాసశర్మ, ఎంపీడీవో టి.ఊహారాణి, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

సాలూరికి ఘన నివాళి

తెనాలి అర్బన్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): ప్రముఖ సంగీత విద్వాంసుడు సాలూరి రాజేశ్వరరావు అందించిన సంగీతం శ్రోతల మదిలో పదిలంగా ఉందని సంగీత విద్వాంసురాలు కల్యాణి చెప్పారు. గాంధీనగర్ ఇస్కఫ్ కార్యాలయంలో అభ్యుదయ కళాసమితి ఆధ్వర్యంలో ఆదివారం సాలూరి వర్ధంతి నిర్వహించారు. కళాకారుల సంఘ కార్యనిర్వాహక అధ్యక్షుడు గరికపాటి సుబ్బారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అరసం జిల్లా అధ్యక్షుడు బెన్‌హర్, వెంకట్, సుబ్రహ్మణ్యం, భీమేశ్వరప్రసాద్, రఘునాథరావు, కృష్ణ, మార్కండేయులు పాల్గొన్నారు.

● సంగీత సామ్రాట్ సాలూరి రాజేశ్వరరావు వర్ధంతి మహాత్మాగాంధీ ఆశ్రమంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆశ్రమ నిర్వాహకులు వజ్రాల రామలింగాచారి, కల్చరల్ ఫిల్మ్ సొసైటీ నిర్వాహకులు బొల్లిముంత కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



వాహన తనిఖీలు నిర్వహిస్తున్న సీఐ సాంబశివరావు

మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దు

తెనాలి క్రైం, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని త్రీటౌన్ సీఐ సాంబశివరావు సూచించారు. ఆదివారం మార్కెట్ ప్రాంతంలో వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ, రెండు రోజుల వాహన తనిఖీల్లో 40మందికి పైగా మైనర్లు ద్విచక్ర వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. దీనికి తల్లిదండ్రులు కూడా బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. రూ.10వేలు జరిమానా విధించడం జరుగుతుందన్నారు. వాహనదారులు సరైన పత్రాలు లేకపోవడం, ట్రిపుల్ రైడింగ్,అతివేగంతోపట్టుబడుతున్నారు. వీరిపై కేసులు నమోదు చేశామన్నారు. పట్టణంలో రాత్రి 11 గంటల దాటిన తరువాత సరైన కారణాలు లేకుండా బజారులో జులాయిగా తిరిగే వారిని స్టేషన్‌కు తరలించడం జరుగుతుందని సిఐ హెచ్చరించారు.

అన్నదాతల్లో తుపాను భయం

● పొట్ట, ఈనిక, గింజ పాలు పోసుకునే దశలో వరి పైరు

● పొన్నూరు పరిసరాల్లో 700 ఎకరాల్లో తమలపాకు సాగు



సాగులో ఉన్న వరి పైరు

పొన్నూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన పెను తుపాను హెచ్చరికలు అన్నదాతల్లో ఆందోళన నింపుతున్నాయి. బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర అల్పపీడనం పెను తుపానుగా మారి కోస్తా జిల్లాలపై పెను ప్రభావం చూపుతుందని వాతావరణ శాఖ హెచ్చరికలు వెలువడ్డాయి. మొంథా తుపాను కోస్తా జిల్లాలపై పెను ప్రభావం చూపుతోందని అంచనాలు వెలువడటంతో అన్నదాతల్లో కలవరం ప్రారంభమైంది. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్లో పొన్నూరు మండలంలో సుమారు 30వేల ఎకరాలలో వరి పైరు సాగవుతోంది. ప్రస్తుతం వరి పైరు కీలక పొట్ట, ఈనిక, గింజ పాలు పోసుకునే దశలో ఉంది ఇప్పటికే అన్నదాతలు ఎకరానికి వరి పైరు సాగు చేయడానికి వేలాది రూపాయలు ఖర్చు చేశారు. పైరు మరో నెల రోజుల్లో చేతికి వచ్చే దశలో బంగాళాఖాతంలో ఏర్పడిన తుపాను ప్రభావంతో పంట దెబ్బతినే పరిస్థితి ఏర్పడింది. తుఫాను ప్రభావం కోస్తా జిల్లాలపై అధికంగా ఉంటుందని అంచనాలు నేపథ్యంలో వరి పైరు పూర్తిగా దెబ్బతింటుందని రైతులు ఆవేదన చెందుతున్నారు. వరి పైరు కీలక దశలో ఉన్న నేపథ్యంలో తుఫాను ప్రభావం తక్కువగా ఉంటే పైరు దిగుబడులపై ప్రభావం చూపుతుందని అదే తుఫాను ఈదురు గాలులు వర్షం ప్రభావం ఉంటే పైరు పూర్తిగా కోల్పోవాల్సి వస్తుందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే పొన్నూరు మండలంలో కీలక వాణిజ్య పంట తమల పాకు సుమారు 700 ఎకరాలలో సాగవుతోంది. తమలపాకు పంటపై తుఫాను ప్రభావం అధికంగా ఉంటుంది. తుఫాను దాటికి తమలపాకు తోటలు నేలవాలి రైతులకు పెనునష్టం తప్పదని ఆందోళన వ్యక్తం అవుతోంది. పంట దెబ్బతింటే ఇప్పటికే లక్షలాది రూపాయలు వ్యయంచేసి సాగుచేసిన తమలపాకు సాగు రైతులు భయంతో అల్లాడిపోతున్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

మండల ప్రత్యేక అధికారి కిరణ్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న మండల ప్రత్యేక అధికారి కిరణ్‌కుమార్

కొల్లిపర, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ కారణంగా భారీ వర్షాలు, పెనుగాలులు వీచే అవకాశం ఉందని మండల ప్రత్యేక అధికారి కిరణ్‌కుమార్ అన్నారు. ఆదివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో అత్యవసర సమావేశాన్ని నిర్వహించారు. తుఫాన్‌పై తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. మండలంలో విద్యుత్ స్తంభాలు ఎక్కడైనా దెబ్బతిన్నాయా అని విద్యుత్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కిరణ్‌కుమార్ మాట్లాడుతూ అధికారులందరూ మండల గ్రామాల్లోనే ఉండాలన్నారు. అవసరమైతే లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం అత్తలూరివారిపాలెం, పిడపర్తిపాలెం, వల్లభాపురం, దావులూరిపాలెం, దావులూరు గ్రామాలను అధికారులతో కలిసి తనిఖీ చేశారు. సమావేశంలో తహసీల్దార్ సిద్ధార్థ, ఎంపీడీవో విజయలక్ష్మి, మండల వ్యవసాయాధికారి శ్రీనివాసరెడ్డి, డిప్యూటీ ఎంపీడీవో భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

● పొన్నూరు: తుపాను ముంపు ప్రభావంతో అధికంగా ఉంటుందని హెచ్చరికల నేపథ్యంలో అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని మండల ప్రత్యేక అధికారి జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి కేవీవీ సత్యనారాయణ ఆదేశించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆదివారం తుపాను నేపథ్యంలో పలు ప్రభుత్వ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. సమావేశానికి హాజరైన ప్రత్యేక అధికారి మాట్లాడుతూ అధికారులు తుపాను ప్రభావం తగ్గేవరకు హెడ్ క్వార్టర్స్ వదిలి వెళ్ళరాదని హెచ్చరించారు. అధికారులకు సెలవులు



సమావేశంలో పాల్గొన్న ప్రత్యేక అధికారి సత్యనారాయణ, తహసీల్దార్ జియావుల్ హక్

రద్దుచేసినట్లు తెలిపారు. శానిటేషన్ సామగ్రిని అందుబాటులో ఉంచుకోవాలన్నారు. సిబ్బంది సెల్ ఫోన్లు చార్జింగ్ పెట్టుకోవాలని, టార్చ్ లైట్‌లు, కొవ్వొత్తులు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. గర్భవతులు, వృద్ధులు, చిన్నపిల్లలు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్థులను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆదేశించారు. తాగు నీటికి ఆటంకం కలగకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. చెరువులు గండ్లుపడే అవకాశం ఉన్నచోట గుర్తించి గండ్లు పూడ్చడానికి ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. కాచి చల్లార్చిన నీరు తాగాలని ప్రజలకు సూచించాలని తెలిపారు. లోతట్టు ప్రాంతాల్లో నివసించే వారికి పునరావాస కేంద్రాలను ఏర్పాటుచేసి తరలించాలని ఆదేశించారు. ఎక్కడైనా చెట్లు పడిపోతే తొలగించే యంత్రాంగాన్ని సిద్ధం చేసుకోవాలని సూచించారు. వాగుల వద్దకు ప్రజలు వెళ్లకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. పాత భవనాల పరిసరాల ప్రాంతాలకు ప్రజలు వెళ్లకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. అత్యవసరమైతే గ్రామాల్లో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు వాహనాలు సైతం అందుబాటులో ఉంచుకోవాలన్నారు. వైద్య సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉండాల్సిందేనని వైద్యశాలలో కుక్క, పాము కాటు మందులు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. సమావేశంలో తహసీల్దార్ జియావుల్ హక్, ఎంపీడీవో చంద్రశేఖరరావు, పలు ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు. మండలంలోని సాంఘీక సంక్షేమాకు చెందిన వసతి గృహాల్లో పునరావస కేంద్రాల ఏర్పాటుకు తహసీల్దార్ తనిఖీలుచేసి వసతులపై ఆరా తీశారు.

భారీ వర్షాలపై రైతులు జాగ్రత్తలు పాటించాలి: ఏవో

పొన్నూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): తుఫాను ప్రభావంతో భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరికల నేపథ్యంలో రైతులు జాగ్రత్తలు పాటించాలని మండల వ్యవసాయశాఖ అధికారి ఆర్.వెంకటేశ్వరరావు ఆదివారం తెలిపారు. వరి పొలాలు అధికముంపునకు గురైతే నీటిని బయటకు మళ్ళించాలని తెలిపారు. వాలిపోయిన వరి పైరులు 4, 5 దుబ్బులు కట్టి నిలబెట్టుకోవాలన్నారు. వరి పైరుకు పాముపొడ తెగులు ఆశించే అవకాశం అధికంగా ఉందని నివారణ మందులు పిచికారి చేయాలని సూచించారు. అలాగే సుడిదోమ ఆశించే అవకాశం ఎక్కువగా ఉంటుందని హెచ్చరించారు. వరి పైరు నుంచి నీరు బయటకు తీసివేసిన తరువాత ఎకరానికి 20 కిలోల యూరియా 20 కిలోల పొటాష్ ఎరువులను బూస్టర్ మోతారుగా వేయాలని సూచించారు.

ఘనంగా గంగానమ్మ కొలుపులు ప్రారంభం

కొల్లిపర, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం కొల్లిపరలో శ్రీగంగానమ్మ అమ్మవారి కొలుపులు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. గ్రామ పెద్దలు కొలుపుల్లో మతసామరస్యానికి ప్రతీకగా నిలిచారు. గ్రామ దేవతలైన గంగానమ్మ, ముత్యాలమ్మ, మారెమ్మ, మద్దిరావమ్మలకు ఇచ్చిన ప్రాముఖ్యతను గ్రామ పెద్దలు మదార్ సాహెబ్‌కు ఇచ్చారు. దీంతో ముస్లిం పెద్ద ఇంటి నుంచి మదార్ సాహెబ్ జెండాను మేళతాళాలతో ఊరేగింపుగా తీసుకువచ్చి రామిరెడ్డి బొమ్మ వద్ద ప్రతిష్ఠించారు. హిందూ పురుషులు చుట్టలు, రొట్టెలు సమర్పించి తమ భక్తి భావాన్ని చాటుకున్నారు. అనంతరం గ్రామస్తులు అంతా కలిసి మద్దిరావమ్మ ప్రతిమను మేళతాళాలతో, డప్పు వాయిద్యాలతో ఊరేగింపుగా తీసుకువచ్చి ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన పురంలో ఉంచారు. మహిళలు వేలాదిగా తరలివచ్చి నైవేద్యాన్ని సమర్పించి సుఖశాంతులతో వర్ధిల్లాలంటూ భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, పేర్నినాని, యాంకర్, వైసీపీ నాయకురాలు శ్యామల స్థానిక నాయకులతో కలిసి గ్రామ దేవతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ ఆచారం ప్రకారం మొట్టమొదటిగా గ్రామబండిని మద్దిరావమ్మ చుట్టూ మేళతాళాలతో ప్రదక్షణలు చేయించిన అనంతరం ట్రాక్టర్లను, ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన ప్రభ బల్లను ప్రదక్షణలు చేయించి మొక్కుబడులు తీర్చుకున్నారు. తర్వాత మద్దిరావమ్మను ఊరేగింపుగా తీసుకు వెళ్ళి గ్రామ పొలిమేరలో ఉంచారు. కొలుపులను చూడటానికి బంధువులతో పాటు వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో తరలిరావటంతో గ్రామమంతా పండుగ వాతావరణం నెలకొంది. ఎస్ఐ కోటేశ్వరరావు పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు.



గ్రామ దేవతను ఊరేగింపుగా తీసుకువస్తున్న భక్తులు

సూత పురాణం రచనకు శత వసంతోత్సవం

తెనాలి అర్బన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): హేతువాద సిద్ధాంతాల ప్రాచుర్యం కోసం రచించిన సూతపురాణం వందేళ్లు పూర్తిచేసుకుందని సాహిత్యవేత్త ముత్తేవి రవీంద్రనాథ్ చెప్పారు. కవిరాజాపార్కులో ఆదివారం సూతపురాణ శత వసంతాల ఉత్సవం నిర్వహించారు. కవిరాజు త్రిపురనేని రామస్వామిచౌదరి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విశ్రాంత రిజిస్ట్రార్ రావెల సాంబశివరావు సూతపురాణాన్ని విశ్లేషించారు. హేతువాద సంఘ అధ్యక్షుడు నార్నె వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ, తెలుగు రాష్ట్రాల్లో మూఢ నమ్మకాల వ్యతిరేకచట్టం తేవాలన్నారు. కార్యక్రమంలో సాంబశివరావు, అయినాల మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



త్రిపురనేని విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న శత వసంత కమిటీ సభ్యులు

ప్రకృతి వ్యవసాయ క్షేత్రాల్లో జీఐఎస్‌టీ బృందం పరిశీలన

కొల్లిపర, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సహకారంతో రైతు సాధికార సంస్థ అమలుచేస్తున్న ప్రకృతి వ్యవసాయ పురోగతిని పరిశీలించటానికి జీఐఎస్‌టీ సంస్థ చైర్‌పర్సన్ ఆండ్రేహాఫ్‌మాన్, సీఈవో పవన్ సుఖ్‌దేవ్‌లు ఆదివారం మండల పరిధిలోని దావులూరిపాలెం గ్రామాన్ని సందర్శించారు. రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ విజయకుమార్ రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ప్రకృతి వ్యవసాయ అమలుతీరు, పురోగతి గురించి క్లుప్తంగా వివరించారు. బయో ఇన్పుట్‌ల తయారీ, ఘన జీవామృతం, బీజామృతం, ద్రవ జీవామృతం తయారీపై వారికి అవగాహన కలిగించారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన పంటల ద్వారా ప్రజలకు మంచి ఆరోగ్యాన్ని ఇస్తాయని జీఐఎస్‌టీ బృందానికి తెలియజేశారు. కార్యక్రమంలో రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నీరజ, జిల్లా ప్రాజెక్టు మేనేజర్ రాజకుమారి, ప్రకృతి వ్యవసాయాధికారులు లక్ష్మీదుర్గ, వాణిశ్రీ, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



ప్రకృతి వ్యవసాయ సాగును పరిశీలిస్తున్న జీఐఎస్‌టీ బృందం

బ్రాహ్మణ కార్పొరేషన్‌కు జీవం పోసిన ప్రభుత్వం

● బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ వెంకట నారాయణమూర్తి

తెనాలి అర్బన్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): బ్రాహ్మణ కార్పొరేషన్‌కు కూటమి ప్రభుత్వం జీవం పోసిందని కార్పొరేషన్ డైరెక్టర్ ఆకెళ్ల వెంకటనారాయణమూర్తి చెప్పారు. నాజరుపేటలోని విద్యాశంకర భారతీ నరసింహ సదన్‌లో ఆదివారం కార్తీక వన సమారాధన నిర్వహించారు. వేదిక్ బ్రాహ్మణ సేవాసమాఖ్య ఆధ్వర్యంలో అధ్యక్షుడు అమ్మణి సుబ్రహ్మణ్యం అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ, సంక్షేమ పథకాలన్నింటిని అమలుచేస్తూ బ్రాహ్మణ కో-ఆపరేటివ్ బ్యాంకు సభ్యులకు రుణాలు కూడా అందిస్తుందని చెప్పారు. డిసెంబరు 13న గుంటూరులో మెగా బ్రాహ్మణ ఉద్యోగ మేళ నిర్వహిస్తున్నామన్నారు. సమాఖ్య సభ్యులు ఆయనను ఘనంగా సన్మానించారు. లక్ష్మీదామోదర పూజ, సహస్రనామ పారాయణలు చేశారు. మురళి, లలితశాస్త్రి, సుబ్రహ్మణ్యం, తిరుమలరావు, సూర్యనారాయణమూర్తి, ప్రభాకర శాస్త్రి, శ్రీనివాసమూర్తి పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్ రోడ్డులో గ్యార్మీ జెండా పండుగ

పట్టణంలోని రైల్వేస్టేషన్ రోడ్డులో ఆదివారం గ్యార్మీ జెండా పండుగ ఘనంగా నిర్వహించారు. మహబూబ్ సుభాని 149వ ఉరుసు ఉత్సవంలో పెద్దసంఖ్యలో ముస్లింలు పాల్గొన్నారు. జెండాచెట్టును అలంకరించి విద్యుత్ దీపాలతో తీర్చిదిద్దారు.

ఉచిత హోమియో వైద్య సేవలు అభినందనీయం

● మానవత సంస్థ రీజనల్ చైర్మన్ కొత్త సుబ్రహ్మణ్యం

తెనాలి అర్బన్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): నాలుగు దశాబ్దాలుగా హోమియో వైద్య సేవలందించడం అభినందనీయమని మానవత సంస్థ రీజనల్ చైర్మన్ కొత్త సుబ్రహ్మణ్యం చెప్పారు. కొల్లిపర మండలం ఈమనికి చెందిన అన్నపూర్ణ ఉచిత హోమియో ఆసుపత్రి వైద్యులు కొర్రపాటి వెంకటేశ్వరరావును ఆదివారం ఘనంగా సన్మానించారు. మానవత సంస్థ ఆధ్వర్యంలో అధ్యక్షుడు కొలసాని రాంచంద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన వారికి ఉచితంగా వైద్యం అందించారని చెప్పారు. సన్మాన గ్రహీత మాట్లాడుతూ, తన కుటుంబ అవసరాల కోసం నేర్చుకున్న విద్య సమాజానికి ఉపకరించడం సంతోషకరంగా ఉందన్నారు. అందరి ఆశీస్సులతో 83 ఏళ్ల వయసులోనూ వైద్యం అందించగలుగుతున్నానని చెప్పారు. వాసు, వెంకట్, ప్రసాద్, మొవ్వా సత్యనారాయణ, కృపాచారి, మల్లేశ్వరరావు, సోమయ్య శాస్త్రి పాల్గొన్నారు.



హోమియో వైద్యుడు వెంకటేశ్వరరావును సన్మానిస్తున్న సంస్థ సభ్యులు



విద్యార్థులకు సూచనలు ఇస్తున్న తహసీల్దార్ శ్రీనివాసశర్మ

బీసీ వసతి గృహాల్లో తహసీల్దార్ తనిఖీ

చేబ్రోలు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ముప్పు నేపథ్యంలో ప్రభుత్వం రెడ్ అలర్ట్ ప్రకటించడంతో, జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశాల మేరకు చేబ్రోలు మండల తహసీల్దార్ శ్రీనివాసశర్మ చేబ్రోలు ప్రాంతంలోని ప్రభుత్వ బీసీ బాలికల, బాలుర వసతి గృహాలను ఆదివారం తనిఖీ చేశారు. తనిఖీ సందర్భంగా హాస్టళ్లలో విద్యార్థుల రక్షణ, వసతి, భోజన సదుపాయాలు సక్రమంగా ఉన్నాయో లేదో పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి ప్రభుత్వం నిర్ణయించిన మెనూ ప్రకారం ఆహారం అందుతున్నదో లేదో తెలుసుకున్నారు. తదుపరి తహసీల్దార్ మాట్లాడుతూ మొంథా తుఫాన్ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని విద్యార్థులు అత్యవసర పరిస్థితుల్లో తప్ప బయటకు రావద్దన్నారు. ఏవైనా ఇబ్బందులు తలెత్తితే వెంటనే తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన కంట్రోల్ రూమ్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. హాస్టల్ వార్డెన్స్ విద్యార్థులకు సమస్యలు ఎదురైతే వారిని వెంటనే సురక్షితమైన ప్రదేశాలకు తరలించాలని ఆదేశించారు.



రక్తదానం చేస్తున్న పోలీసు సిబ్బంది

పోలీస్ అమరవీరుల త్యాగాలు మరువలేనివి

● అర్బన్ సీఐ వీరా నాయక్

పొన్నూరు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): పోలీస్ అమరవీరుల త్యాగాలు మరువలేనివని అర్బన్ సీఐ ఎల్ వీరా నాయక్ అన్నారు. స్థానిక రోటరీ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం పోలీస్ అమరలవీరుల వారోత్సవాల సందర్భంగా పోలీసు శాఖ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసు సిబ్బంది, పలు స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పోలీస్ అధికారులు మాట్లాడుతూ శాంతిభద్రతల పర్యవేక్షణలో పోలీసుల పాత్ర మరువలేనిదన్నారు. నిష్పక్షపాతంగా విధులు నిర్వహించి ప్రజల ప్రాణ, మాన రక్షణకు పోలీసులు పని చేస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో రూరల్ సీఐ వై కోటేశ్వరరావు, ఎస్ఐలు గండు కిరణ్ కుమార్, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌వీఐటీలో విద్యార్థుల రక్తదానం

చేబ్రోలు, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా పొన్నూరు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో ఆర్‌వీఐటీ చేబ్రోలు విద్యార్థులు పాల్గొని రక్తదానం చేశారు. కార్యక్రమంలో పోలీస్‌శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్‌వీఐటీ చేబ్రోలు విద్యార్థులను పోలీసు ఉన్నతాధికారులు అభినందించారు.

నకిలీ ధ్రువ పత్రాలతో అన్నకు టోకరా

తెనాలి క్రైం, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి) : నకిలీ ధ్రువ పత్రాలతో అన్నకు టోకరా వేశాడు ఓ తమ్ముడు. చనిపోయిన తల్లిదండ్రులకు తానొక్కడే కొడుకునని చూపుతూ ఇన్సూరెన్స్ నగదు, బ్యాంకు లాకర్‌లోని బంగారం దక్కించుకున్నాడు. దీంతో మోసపోయానని గ్రహించిన అన్న పోలీసులను ఆశ్రయించాడు. ఈ ఘటన స్థానిక నాజరుపేటలో చోటుచేసుకుంది. స్థానికంగా నివాసం ఉండే అన్నదమ్ములు రాజేష్, రమేష్ తల్లిదండ్రులు 2021లో మృతి చెందారు. చిన్నవాడైన రమేష్ తల్లిదండ్రులకు తాను ఒక్కడినే కొడుకునని నకిలీ ధ్రువపత్రాలు సృష్టించి.. వారి పేరిట ఉన్న రూ.7 లక్షల ఇన్సూరెన్స్ నగదు, బ్యాంకు లాకర్స్‌లోని బంగారం చేజిక్కించుకున్నాడు. ఈ మోసంపై అన్న రాజేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు వన్ టౌన్ పోలీసులు తెలిపారు.

వైకుంఠపురంలో సత్యనారాయణస్వామి వ్రతాలు

తెనాలి అర్బన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వైకుంఠపురం ఆలయంలో ఆదివారం శ్రీరమా సహిత సత్యనారాయణస్వామి వ్రతాలను నిర్వహించారు. శ్రీలక్ష్మీపద్మావతి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి శాంతి కల్యాణ మండపంలో నిర్వహించిన వ్రతాలకు పెద్ద సంఖ్యలో దంపతులు పాల్గొన్నారు. కార్తీక మాసంలో మొదటి ఆదివారం వ్రతాలలో 200మంది భక్తులు పాల్గొన్నారు. గత 20ఏళ్లుగా ఆలయంలో సత్యదేవ వ్రతాలు జరుగుతున్నాయని ఈవో అనుపమ చెప్పారు. ట్రస్ట్ బోర్డు చైర్మన్ కె.సాయిబాబు, సభ్యులు వ్రత పూజల్లో పాల్గొన్నారు. అర్చకులు సత్యనారాయణ గౌతమ, అర్చక సిబ్బంది వ్రత ప్రాధాన్యతను వివరిస్తూ భక్తులతో వ్రతం ఆచరింపజేశారు. అనంతరం భక్తులకు స్వామివారి దర్శనం, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

షుగర్ వ్యాధిగ్రస్థులు ఆహార నియమాలు పాటించాలి

● డాక్టర్ శారద

తెనాలి అర్బన్, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): షుగర్ వ్యాధిగ్రస్థులు ఆహార నియమాలు పాటిస్తూ తగిన వ్యాయామం చేస్తే ఎలాంటి సమస్యలు ఉండవని డాక్టర్ శారద చెప్పారు. బుర్రిపాలెం రోడ్డులోని డాక్టర్ శారదా సర్వీస్ సొసైటీ భవనంలో ఆదివారం మధుమేహ వ్యాధిగ్రస్థులకు ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి అల్పాహారం పంపిణీచేశారు. నెలకు సరిపడా మందులు ఉచితంగా అందించారు. 210మంది రోగులు వైద్యసేవలు అందుకున్నారు. డాక్టర్ శారద మాట్లాడుతూ, మందులు వాడితే సరిపోతుందనే రోగులు భావించవద్దని తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వం అప్పగించిన డోర్ టు డెస్టినేషన్ ప్రాజెక్టులో మహిళలకు ఇంటి వద్దనే రక్త నమూనాలు సేకరించి పలు రకాల పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తామన్నారు. ప్రతి మహిళ ఈ ప్రాజెక్టులో పాల్గొనాలని, ఆరోగ్యం ఉన్న వారు కూడా సమూహంగా ఏర్పడి సమాచారం ఇస్తే పరీక్షలను ఉచితంగా చేస్తామన్నారు. 20 వంటి సొసైటీ వలంటీర్లు సేవలు అందించారు.

సంగం జాగర్లమూడిలో వైద్య శిబిరం

తెనాలి అర్బన్, అక్టోబరు 26 (ఆంధ్రజ్యోతి): రూరల్ మండలంలోని సంగం జాగర్లమూడిలో కొత్త సత్యనారాయణ కల్యాణ మండపంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. తెనాలి జేవీఎం మల్టీ స్పెషాలిటీ వైద్యులు కోటి నాగయ్య, పవన్‌కుమార్, లోకేష్ తదితరులు వైద్యసేవలు అందించారు. సర్పంచ్ జయనాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అన్నదాత సుఖీభవ కౌలు రైతులకు వర్తింప చేయాలి

● సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు రామారావు డిమాండ్

పెదకాకాని, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ పథకాన్ని కౌలు రైతులకు వర్తింపచేయాలని లేనిపక్షంలో ఆందోళనకు దిగుతామని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు పాశం రామారావు అన్నారు. మండల కేంద్రమైన పెదకాకానిలోని సీపీఎం కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 70శాతం భూమిని నిరుపేద కౌలు రైతులే సాగు చేస్తున్నారన్నారు. కౌలు రైతులకు భూ యజమాని సంతకంతో పని లేకుండా గుర్తింపుకార్డులు ఇచ్చి పంట రుణాలు మంజూరు చేయాలన్నారు. సీపీఎం మండల కార్యదర్శి నన్నపనేని శివాజీ మాట్లాడుతూ కాల్వ కట్టలు మరమ్మతులు చేసి వరదనీరు పొలాల్లోకి రాకుండా పటిష్ఠ చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో సీపీఎం శాఖ కార్యదర్శి ఎం.శ్రీనివాస్, వెంకటరెడ్డి, ఆదాం తదితరులు పాల్గొన్నారు.